- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శనివారం
18-04-2026

సంపుటి : 01 సంచిక :27   పేజీలు : 08   వెల : ₹5/-   తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Namastey Mahaaprabha

Published From RANGAREDDY తెలంగాణ. RNI NO : TGTEL/26/A0738 VOLUME : 01 ISSUE :27   NAMASTEY MAHAAPRABHA



## కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి షాక్..

- రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం
- బ్రిటన్ పౌరసత్వం కలిగి ఉన్నట్లు ఆరోపణలు
- ద్వంద్వ పౌరసత్వంపై విచారణకు అలహాబాద్ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ ఏప్రిల్ 17( మహాప్రభ

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి యూపీలోని అలహాబాద్ హైకోర్టు షాకిచ్చింది. ఆయనపై వచ్చిన ద్వంద్వ పౌరసత్వం ఆరోపణలపై విచారణ జరపాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. లేదా ఈ అంశాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలకైనా అప్పగించాలని సూచించింది. అలహాబాద్ హైకోర్టుకు చెందిన లక్నో బెంచ్ శుక్రవారం ఈ అంశంపై ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై విచారణకు యూపీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం కలిగి ఉన్నాడని ఆరోపణలున్నాయి. దీనిపై గత ఏడాది డిసెంబర్ 17న రాయ్‌బరేలిలోని ఎంపీ, ఎమ్మెల్యే స్పెషల్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను కోర్టు లక్నో కోర్టుకు

-మిగతా 3 లో

# వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

బిల్లుకు అనుకూలంగా 298...
వ్యతిరేకంగా 230 ఓట్లు..


- మిగిలిన రెండు బిల్లులు ఉపసంహరణ
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి
- ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం

### 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17( మహాప్రభ

మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొదొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది.

-మిగతా 3 లో



## రాహుల్ నేతృత్వంలో విపక్షాలు ఐక్యత చాటాయి

- జాతీయ విపత్తును నివారించిన రోజు
- ఇందుకు సహకరించిన విపక్ష నేతలకు కృతజ్ఞతలు
- ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17( మహాప్రభ

ఇవాళ జాతీయ విపత్తును నివారించిన రోజు అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్షాలు కలిసి జాతీయ విపత్తును నివారించాయన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి స్పందించారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జాతీయ విపత్తును అడ్డుకున్నారు. దేశ చరిత్రలో సువర్ణదినంగా ఇవాళ గుర్తుండిపోతుంది. నల్ల బిల్లులను ఓడించేందుకు ఏకమైన మిత్రపక్షాల నేతలకు ధన్యవాదాలు అని రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. లోక్‌సభలో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్

-మిగతా 3 లో

## ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

- హోర్మూజ్ జలసంధి తెరిచి ఉంటుందని ప్రకటన
- కాల్పుల విరమణ ఒప్పంద కాలం ముగిసేవరకూ హోర్ముజ్ పూర్తిగా తెరిచి ఉంటుందని ఎక్స్ వేదికగా వెల్లడి
- ఇరాన్ ప్రకటనతో భారీగా తగ్గిన ఆయిల్ ధరలు
- దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు



టెహ్రాన్, ఏప్రిల్ 17( మహాప్రభ

ప్రపంచానికి ఇరాన్ శుభవార్త అందించింది. ర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచినట్లు ప్రకటించింది. ఇజ్రాయిల్, లెబనాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు అమాంతంగా పడిపోయాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ రవాణాకు కీలకంగా మారిన హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పంద కాలం ముగిసేవరకూ హోర్ముజ్ పూర్తిగా తెరిచి ఉంటుందని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇరాన్ తాజా ప్రకటనతో.. హోర్ముజ్ జలసంధిలో ఇకపై అన్ని వాణిజ్య నౌకలకు ప్రవేశం ఉంటుంది.

-మిగతా 3 లో

## అంబానీని మించిన అదానీ

- ఆసియాలోనే టాప్ కుబేరుడిగా చోటు

3 లో






## ఆగని కేకేఆర్ ఓటముల పరంపర..

- గుజరాత్ హ్యాట్రిక్ విక్టరీ
- ఈ సీజన్‌లో ఐదో మ్యాచ్‌లో ఓడిన కోల్‌కతా
- అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌పై పరాభవం
- హ్యాట్రిక్ విక్టరీ నమోదు చేసిన గిల్ సేన

3

## రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్ములా

- ఉత్తరాది, దక్షిణాది పేరుతో విషం చిమ్ముతున్నారు
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17( మహాప్రభ

దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ పక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రా లకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి

-మిగతా 3 లో

# కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు



### నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ జైన్‌తో చర్చించాం

- వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి
- 20న సిఎం రేవంత్ మేడిగడ్డను పరిశీలిస్తారు
- కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నాం
- తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17( మహాప్రభ

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు,

-మిగతా 3 లో




## పదేళ్లు అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు

- ఇప్పుడే పాదయాత్ర చేయాలని ఎందుకనో
- కెటిఆర్‌పై విమర్శలు గుప్పించిన కవిత
- ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని నిదీస్తాం
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 17( మహాప్రభ

పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. పాదయాత్ర చేస్తానని మాజీ మంత్రి కేటీఆర్ ఇప్పుడు ఎందుకు అంటున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆయన ఎందుకు ప్రజల్లోకి పోలేదని నిలదీశారు. ప్రజా సమస్యలను పరిష్కరించేది అధికార పార్టీనేనని.. అందుకే కాంగ్రెస్‌ను టార్గెట్ చేశానని కవిత తెలిపారు. ఆయా సమస్యల ఆధారంగా బీఆర్ఎస్‌పైన కూడా మాట్లాడుతానని అన్నారు. పరిగిలో రైతు దీక్షకు మద్దతు ఇచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి.. హరీశ్‌రావు హౌస్ అరెస్ట్ అయ్యారని తెలిపారు. ఆ సమయంలో హరీశ్‌రావు ఫోన్ చేస్తే పోలీసులు ఆయన ఇంటికి వచ్చి హౌస్ అరెస్ట్ చేశారని విమర్శించారు. హరీశ్‌రావు పరిగిదాకా కూడా పోలేదని ఎద్దేవా చేశారు. తాము పరిగి వెళ్లి రైతులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నామని

-మిగతా 3 లో



## ఇరాన్‌తో ఒప్పందానికి దగ్గరలో ఉన్నాం

- రెండు దేశాల మధ్య వచ్చే వారాంతంలో చర్చలు
- యుద్ధం త్వరగా ముగియాలి
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి


వాషింగ్టన్ : ఏప్రిల్ 17( మహాప్రభ

అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఒప్పందానికి దగ్గరలో ఉన్నామని తెలిపారు. వచ్చే వారాంతంలో అమెరికా, ఇరాన్ దేశాల మధ్య చర్చలు జరగొచ్చని చెప్పారు. యుద్ధం త్వరగా ముగుస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. "ఏం జరగనుందో మనం చూడబోతున్నాం. ఇరాన్‌తో ఒప్పందం చేసుకోవడానికి చాలా దగ్గరలో ఉన్నామని నేను అనుకుంటున్నాను" అని ట్రంప్ చెప్పారు. వైట్‌హౌజ్ బయట రిపోర్టర్లతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత లాస్ బేగాస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన 'ఈ యుద్ధం చాలా త్వరలో ముగియాలి' అని తెలిపారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ అవోన్‌తో మంచి చర్చలు జరిగాయని ట్రంప్ చెప్పారు. వారిని వైట్ హౌజ్‌కు ఆహ్వానించి శాశ్వత శాంతి

-మిగతా 3 లో

## 'టైమ్' ప్రభావశీలుల జాబితా విడుదల

- ట్రంప్, జిన్‌పింగ్, మమ్దానీ వంటి నాయకులకు చోటు
- నేపాల్, బంగ్లా పీఎంలకూ దక్కిన స్థానం
- కనిపించని భారత ప్రధాని మోడీ పేరు



న్యూఢిల్లీ ఏప్రిల్ 17( మహాప్రభ

ప్రతిష్టాత్మక టైమ్ మ్యాగజైన్ 2026 సంవత్సరానికి విడుదల చేసిన ప్రభావశీలుల జాబితాలో ప్రపంచ నాయకులు, వ్యాపారవేత్తలు, టెక్ నిపుణులు, కళాకారులు చోటు సంపాదించారు. లీడర్స్ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా ప్రెసిడెంట్ షీ జిన్‌పింగ్, న్యూయార్క్ యువ మేయర్ జోహ్రాన్ మమ్దానీతో పాటు పలువురు నాయకులు ఉన్నారు. ఉన్నారు. భారత ప్రధాని మోడీకి మాత్రం ఈ జాబితాలో స్థానం దక్కకపోవడం గమనార్హం. అయితే ముగ్గురు భారతీయులు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు.ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన టైమ్

-మిగతా 3 లో

# భారీగా అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

**-ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు**



**దేవరకొండ ఏప్రిల్ 17 ( మహాప్రభ )**
దేవరకొండ నియోజకవర్గంలోని, కొండమల్లేపల్లి: మండల పరిధిలోని కోల్ ముంతల్ పహాడ్ గేట్ వద్ద శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా అక్రమ రేషన్ బియ్యం పట్టుబడింది. కొండమల్లేపల్లి ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా, అనుమానాస్పదంగా వస్తున్న ఒక టవేరా వాహనాన్ని (టూ 12 జుూ 2982) ఆపి సోదా చేశారు. ఈ సోదాలో వాహనంలో తరలిస్తున్న 8 క్వింటాళ్ల బరువు గల 18 రేషన్ బియ్యం బస్తాలను పోలీసులు గుర్తించారు. వాహనంలో ఉన్న వ్యక్తులను విచారించగా, వారు కడ్తల్ మండలం పల్లి చెల్క తండాకు చెందిన నేనవత్ గోపాల్ (తండ్రి: బిచ్యా), మరియు జర్పుల కుమార్ (తండ్రి: జానీ, 23 సం॥) గా నిర్ధారణ అయ్యింది.నిందితులు దేవరకొండ మరియు కొండమల్లేపల్లి మండలాల్లోని చుట్టుపక్కల గ్రామాల నుండి తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు బియ్యాన్ని సేకరించినట్లు ఒప్పుకున్నారు. సేకరించిన ఈ బియ్యాన్ని ఎక్కువ ధరకు విక్రయించేందుకు చారకొండకు తరలిస్తుండగా పట్టుబడినట్లు వారు విచారణలో వెల్లడించారు.
పోలీసులు బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయించినా లేదా కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# అమావాస్య సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఘనంగా అన్నప్రసాద కార్యక్రమాలు.



**కొత్తపేట -17 ఏప్రిల్ (మహాప్రభ)**
అమావాస్య సందర్భంగా బీజేపీ నాయకులు వివిధ ప్రాంతాల్లో అన్నప్రసాద కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కమర్షియల్ టాక్స్ కాలనీలోని మైసమ్మ దేవాలయం వద్ద రామకృష్ణ ఆధ్వర్యంలో మోహన్ నగర్ లో శ్రీ సేవా సమితి ఆధ్వర్యంలో ఉపేందర్ సింగ్ ఠాకూర్ , అలాగే మారుతి నగర్ లో నవీన్ చారి మరియు వారి మిత్ర బృందం అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నదానం మహాదానం అని పేర్కొంటూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. సమాజంలో సేవా భావాన్ని పెంపొందించేందుకు ఈ తరహా కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొగ్గారపు శరత్ చంద్ర , బీజేపీ నాయకులు సురేందర్ గారు, గట్టు మహేష్ కుమార్ , అలాగే స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రామాయంపేటలో అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన కార్యక్రమం



**రామాయంపేట మహాప్రభ 17 ఏప్రిల్**
అగ్గిమాపక సేవ 2026 వారోత్సవాలు కార్యక్రమాలలో భాగంగా రామాయంపేట పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణ భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అసిస్టెంట్ లీడింగ్ ఫైర్ ఆఫీసర్ ఆర్. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో అగ్ని ప్రమాద లేదా నివారించాలి భద్రత చర్యలు, అత్యవసర సమయంలో జాగ్రత్తల వంటి అంశాలపై వారినాత్మకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అభ్యప్రమాదాలు ఎక్కువగా అవగాహన లేకపోవడంతోనే జరుగుతాయని ప్రతి ఒక్కరు బాధ్యత నియమాలు పాటిస్తే ఇటువంటి ప్రమాదాలు తగ్గించవచ్చని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ లింబాద్రి వైద్యులు మరియు వైద్య సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**రామాయంపేట ఏప్రిల్ 17 మహాప్రభ**
మెదక్ జిల్లా రామయంపేట తాసిల్దార్ కార్యాలయం వద్ద టిజిఈ జెఎసి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఉద్యోగులు పెన్షనర్ సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం భోజనం విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు.ఈ సందర్భంగా మూడు సంవత్సరాలు దాటిన పిఆర్సి పై ప్రకటన చేయకపోవడం, ఐదు సంవత్సరాల డీఏ పెండింగ్లో, సిపిఎస్ రద్దు పెన్షనర్ల బకాయిలు చెల్లింపులు వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు అనంతరం తాసిల్దార్ రజనీ కుమారికి వినతి పత్రం సమర్పించారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్ల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షులు కే రాములు పిఆర్టియు జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ స్టేట్ కౌన్సిల్ రమేష్ టిఆర్టిఎఫ్ అధ్యక్షుడు నాగేందర్ ఉపాధ్యాయులు నవాజ్ ప్రమోద్ మన్నే వెంకటస్వామి మన్నే గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ కుమారుడి పెత్తనం.. మల్టీపర్పస్ వర్కర్‌కు వేధింపులు, ఆరు నెలల జీతం నిలుపుదల.



**దేవరకొండ ఏప్రిల్ 17( మహాప్రభ**
దేవరకొండ నియోజకవర్గంలోని, చందంపేట మండలం గుంటిపల్లి గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న నల్ల దేవరాజ్ పట్ల సర్పంచ్ కుమారుడు మాధవరం శంకర్రావు రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారని బాధిత వర్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ ఏర్పాటైనప్పటి నుండి క్రమం తప్పకుండా విధులు నిర్వహిస్తున్న తనను, సర్పంచ్ మాధవరం మదనమ్మ కుమారుడు శంకర్ రావు కావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.సర్పంచ్ మాధవరం మదనమ్మ అయినప్పటికీ, ఆమె కుమారుడు శంకర్ రావు తానే సర్పంచ్‌గా వ్యవహరిస్తూ పంచాయతీ కార్యకలాపాల్లో తలదూర్చుతున్నారు. గత ఎన్నికల్లో తన తల్లికి ఓటు వేయలేదనే కారణంతో నాపై కక్ష పెంచుకున్నారు. ప్రతిరోజూ విధులకు హాజరవుతూ ట్రాక్టర్ డ్రైవింగ్, కరెంటు పనులు, పైప్‌లైన్ లీకేజీలు సరిచేస్తున్నప్పటికీ.. నేను ఏ పని చేయడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారు.పంచాయతీ అటెండెన్స్ రిజిస్టర్ తన వద్దే ఉంచుకుని సంతకం చేయనివ్వడం లేదు. నా వద్ద ఉండాల్సిన గ్రామ పంచాయతీ తాళాలు, ట్రాక్టర్ తాళాలు బలవంతంగా లాక్కొని బయటి వ్యక్తులకు ఇచ్చారు. గత ఆరు నెలలుగా రావాల్సిన వేతనాన్ని సర్పంచ్ ద్వారా రాకుండా అడ్డుకుంటున్నారు.
పంచాయతీ కార్యదర్శిని సైతం బెదిరించి, నాపై తప్పుడు నోటీసులు ఇచ్చేలా ఒత్తిడి తెచ్చారు.
ఈ విషయమై సర్పంచ్ మదనమ్మను వివరణ కోరగా, తనకు ఏమీ తెలియదని, కుమారుడితో మాట్లాడతానని దాటవేస్తున్నారని దేవరాజ్ తెలిపారు. తన డ్యూటీని తాను ప్రశాంతంగా చేసుకునేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతాన్ని వెంటనే చెల్లించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజకీయ కక్షలతో కిందిస్థాయి సిబ్బందిని వేధించడం సరికాదని, తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# ఉద్యోగ అధికారుల డిమాండ్స్ వెంటనే పరీక్షించాలి

**-పెండింగ్ బిల్లులు వెంటనే అమలు చేయాలి**
**-తాసిల్దార్ కి వినతి పత్రం**



**గాంధారి, ఏప్రిల్ 17 (మహా ప్రభ)**
తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యవర్గం తీసుకున్న నిర్ణయం మేరకు, గాంధారి మండలం ఉద్యోగులు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం మండల తహశీల్దార్ రేణుక చావన్, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా చేపట్టిన ఆందోళనలో భాగంగా ఈ వినతిపత్రాన్ని సమర్పించామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమ ప్రధాన డిమాండ్లను పరిశీలించి, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధాన డిమాండ్లు, పీఆర్సీ అమలు, కొత్త పీఆర్సీ కమిషన్ నివేదికను వెంటనే తెప్పించి, 51% ఫిట్‌మెంట్‌తో జూన్ 2వ తేదీలోపు అమలు చేయాలి. పెండింగ్ బిల్లులు,రిటైర్డ్ ఉద్యోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న రూ. 13,000 కోట్ల బకాయిలను ఏక మొత్తంగా విడుదల చేయాలి. ఆరోగ్య కార్డులు, కొత్త ఈహెచ్ఎస్ స్కీం విధివిధానాలను రూపొందించి, మే 1 నుండి ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. పెన్షన్ విధానం, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ( ఓ బి సి) పునరుద్ధరించాలి. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ భక్తయారుద్దీన్, జూనియర్ అసిస్టెంట్లు శరత్, వెంకట్, పంచాయతీ కార్యదర్శులు, ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గౌరవంపై వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

**- కాంగ్రెస్ నిరసన**



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 17 (మహా ప్రభ )**
తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ గౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ--- పార్లమెంట్ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తక్కువ చేసి మాట్లాడటం ప్రజల భావోద్వేగాలను అవమానించడమేనని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఎన్నో సంవత్సరాల పోరాటం, అమరుల త్యాగాల ఫలితమని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పాటును భారత్--పాకిస్తాన్ విభజనతో పోల్చడం అనుచితమని, వెంటనే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని తేజస్వి సూర్యను డిమాండ్ చేశారు. అలాగే, ఈ అంశంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనలో యువనేత యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ--- తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను యువత తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజనులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటారు.

## అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ అనుచిత వ్యాఖ్యల పై డీఎస్పీకి పిర్యాదు చేసిన నాయకులు



**తూప్రాన్ ఏప్రిల్ 17,(మహా ప్రభ)**
జాతీయ దళిత నాయకుడు AICC అధ్యక్షులు శ్రీ మల్లిఖార్జున ఖర్గే గారిపై దాడి చేసి చంపేస్తామని అస్సాం ముఖ్యమంత్రి హిమాంత్ బీస్వా శర్మ చేసిన ప్రకటన దళితుల ఆత్మగౌరవాన్ని భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని కాబట్టి అస్సాం సీఎం హిమాంత బిశ్వ శర్మ పై ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మెదక్ జిల్లా తూప్రాన్ అంబేద్కర్ సంఘం ప్రధానకార్యదర్శి మన్నె భానుప్రసాద్ దళితరత్న మాలమహానాడు నాయకులు సామల అశోక్ శుక్రవారం నాడు తూప్రాన్ పోలీస్ స్టేషన్లో డీఎస్పీకి పిర్యాదు చేయడం జరిగింది.ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి భానుప్రసాద్ మాట్లాడుతూ అత్యున్నత పదవి ఐన ఒక సీఎం పదవిలో ఉన్న అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని తక్షణమే హిమంతను భాజపా హైకమాండ్ అస్సాం సీఎం పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# పోడు భూములు సమస్య పై విస్తృతంగా చర్చ

**-ప్రొఫెసర్ కోదండ రెడ్డి**



**గాంధారి, ఏప్రిల్ 17 (మహా ప్రభ)**
తెలంగాణ ప్రభుత్వం రైతు వ్యవసాయ సంక్షేమ శాఖ కమిషనర్ చైర్మన్ ప్రొఫెసర్ కోదండ రెడ్డి ఆధ్వర్యంలో పోడు భూముల సమస్యలపై ముఖ్య సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్, గడుగు గంగాధర్ , రైతు శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాథోడ్ సురేందర్, తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మోహన్ నాయక్, రాథోడ్ ప్రతాప్, లబాన రాష్ట్ర అధ్యక్షుడు తాన్ సింగ్ నాయక్, హాజరయ్యారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం గాంధారి మండల అధ్యక్షుడు బొట్టు మూతిరామ్, అధ్యక్షుడు జగ్మల్, యూత్ అధ్యక్షుడు నర్సింగ్ ఆంగోత్, ఐబీఎస్ జనరల్ సెక్రటరీ రాందాస్, ఉప సర్పంచ్ బలి రామ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పోడు భూముల సమస్యలపై విస్తృతంగా చర్చించబడింది. కమిషనర్ మాట్లాడుతూ.. పోడు భూముల సమస్యలను ఒక నెలలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని, రాములు నాయక్ కలిసి పట్టాల విషయంపై చర్చించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధికారులు, ఆర్డీవో, కరెంట్ ఏఈ/ఏసీ, సూపరింటెండెంట్ మేడం తదితరులు పాల్గొని సమస్యలపై చర్చించారు. పోడు భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి.

# SPR స్కూల్లో గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్ డే

**-ప్రిన్సిపాల్: శ్రావణ్**



**దేవరకొండ ఏప్రిల్ 17 ( మహాప్రభ )**
స్థానిక ఎస్పిఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ లో శుక్రవారం సాయంత్రం గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్ డే సాయంకాల వేళలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు వారి వారి వేషాధారణాలలో పలు విధములైన ఆంగ్లం భాషలో ప్రసంగాలు అదరగొట్టారు. విద్యార్థిని విద్యార్థులు పలు విధములైన వేషాధారణాలలో ప్రత్యేకమైన డాన్సులు నిర్వహించి తల్లిదండ్రులను అభిమానులను సంతోషపరిచారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణ్ మాట్లాడుతూ విద్యార్థులు తమదైన శైలిలో డ్యాన్సులు చేస్తూ పాటలతో ప్రజలను తమదైన విధానములో సంతోష పరచాలని తెలిపారు. సువిశాలమైన విశాల గదులలో విద్యార్థిని విద్యార్థులు చదువుకుంటూ అన్ని రంగాలలో ఉద్యోగములు చేయుచున్నారని తెలిపారు. విద్యయే ప్రగతికి మెట్టు అని ఆయన గుర్తు చేశారు. నేటి బాలలే రేపటి పౌరులని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యను అభ్యసించి మేధావులుగాను. ఇంజనీర్లుగాను. శాస్త్రవేత్తలు గాని. రాజకీయాలలో ఎదుగుతూ తల్లిదండ్రులను సంతోషపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు. శ్రీను. కృష్ణమూర్తి. శ్రీను కృష్ణమూర్తి. మల్లికార్జున్. రవి. శైలజ. లక్ష్మి. భవాని. తదితరులు పాల్గొని ఆనందించారు

## కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి షాక్..

మొదటి తరువాయి

మార్చింది. ఈ పిటిషన్‌ను లక్నో కోర్టు డిస్మిస్ చేసింది. దీన్ని సవాలు చేస్తూ కర్ణాటక బీజేపీకి చెందిన నేత విఘ్నేశ్ శిశిర్.. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాహుల్ ద్వంద్వ పౌరసత్వం కలిగి ఉన్నారని, అందువల్ల ఆయనపై అఫీషియల్ సీక్రెట్ యాక్ట్, ఫారెనర్స్ యాక్ట్, పాస్‌పోర్ట్ యాక్ట్ కింద బీఎన్ఎస్ ప్రకారం కేసులు నమోదు చేయాలని కోరారు. దీనిపై విచారించిన అలహాబాద్ హైకోర్టు తాజాగా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. రాహుల్‌పై కేసు నమోదు చేయాలని సూచించింది. రాహుల్ గాంధీపై బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి చాలాకాలంగా దీనిపై ఆరోపణలు చేస్తున్నారు. రాహుల్ గాంధీకి బ్రిటీష్ పౌరసత్వం ఉందన్నారు. అక్కడి ఒక కంపెనీలో ఆయన డైరెక్టర్‌గా ఉన్నట్లు కూడా సుబ్రహ్మణ్య స్వామి ఆరోపించారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో రాహుల్ గాంధీని బ్రిటీష్ పౌరుడిగా పేర్కొన్నట్లు స్వామి చెప్పారు. ఇలా ఇండియాలో ఉంటూ, మరో దేశంలో పౌరసత్వం కలిగి ఉండటం నేరమని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై కేంద్రానికి కూడా ఆయన లేఖ రాశారు.

## ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

మొదటి తరువాయి

అంతర్జాతీయ వాణిజ్య రవాణాకు కీలకమైన ఈ జలమార్గంలో వాణిజ్య నౌకల ప్రయాణాలకు మార్గం సుగమమైంది. ఇరాన్, ఇతర దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే ఈ జలమార్గంపై.. కొన్ని నెలలుగా వివాదాలు కొనసాగుతున్నప్పటికీ, కాల్పుల విరమణ సమయం ముగిసేవరకూ.. యథావిధిగా వాణిజ్య రవాణా కొనసాగించవచ్చని ఇరాన్ స్పష్టం చేసింది. కాగా.. హోర్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సుమారు 20 శాతం ప్రపంచ క్రూడాయిల్ సరఫరా అవుతుందన్న విషయం తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా–ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్–ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడ డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగను న్నాయని తెలిపారు. ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది.

## రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా

మొదటి తరువాయి

పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకం. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే. సీఎం రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదు.. అది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నాయని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు. దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకు నరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారని అన్నారు.

## ఇరాన్‌తో ఒప్పందానికి దగ్గరలో ఉన్నాం

మొదటి తరువాయి

కోసం చర్చలు జరపాలని ఆయన యోచిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, సైనిక ప్రధానాధికారి డాన్ కైనెలకు ఇజ్రాయిల్–లెబనాన్ మధ్య శాశ్వత శాంతి సాధించేందుకు పని చేయాలని ట్రంప్ ఆదేశించినట్టు చెప్పాయి. ఇటు ఇరాన్ కూడా కాల్పుల విరమణను స్వాగతించింది. పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో ఈ ఒప్పందం కుదిరిందని వివరించింది.

## ఆగని కేకేఆర్ ఓటముల పరంపర..

**-గుజరాత్ హ్యాట్రిక్ విక్టరీ**
**-ఈ సీజన్‌లో ఐదో మ్యాచ్‌లో ఓడిన కోల్‌కతా**
**-అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌పై పరాభవం**
**-హ్యాట్రిక్ విక్టరీ నమోదు చేసిన గిల్ సేన**



న్యూఢిల్లీ

ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఓటముల పరంపర కొనసాగుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఒక్క గెలుపు కూడా లేని కేకేఆర్, మళ్లీ ఓడిపోయింది. కమ్ బ్యాక్ ఇవ్వాలని గట్టి సంకల్పంతో బరిలోకి దిగిన కోల్‌కతా గుజరాత్‌పై తేలిపోయింది. బౌలింగ్‌లో గట్టిపోటీ ఇచ్చి ఆఖరి ఓవర్ వరకూ మ్యాచ్‌ని తీసుకొచ్చింది. అయితే, చివరి ఓవర్‌లో గుజరాత్ విజయం సాధించడంతో కేకేఆర్ ఈ సీజన్‌లో ఐదో ఓటమిని ఎదుర్కొంది. ఈ విజయంతో గుజరాత్ హ్యాట్రిక్ విక్టరీ నమోదు చేసింది.అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్ – కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి, బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ 20 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌట్ అయింది. ఒకానొక దశలో 200కు పైగా స్కోర్ చేసేలా కనిపించిన కోల్‌కతా ఆఖరి ఐదు ఓవర్లలో వరుస వికెట్లు కోల్పోయి 180 పరుగులకే పరిమితమైంది.హోం గ్రౌండ్‌లో ఈజీ టార్గెట్‌తో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ జట్టు ఆరంభం నుంచి దూకుడుగానే ఆడింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బౌండరీల మోత మోగించగా, సాయి సుదర్శన్ కూడా ఫర్వాలేదు అనిపించాడు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 57 పరుగులు జోడించారు. సాయి సుదర్శన్ 16 బంతుల్లో ఒక ఫోర్, రెండు సిక్సర్లతో 22 పరుగులు చేసి అవుటయ్యాడు. పవర్ ప్లేలో గుజరాత్ 71 పరుగులు బాదేసింది.జోస్ బట్లర్ కూడా 15 బంతుల్లో రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 25 పరుగులు చేసి పెవిలియన్‌కు వెళ్లగా, వాషింగ్టన్ సుందర్ 13 బంతుల్లో 13 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. సెంచరీకి అతి దగ్గర ఉన్న సమయంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అవుటయ్యాడు. 50 బంతులు ఆడిన గిల్ ఎనిమిది ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 86 పరుగులు చేశాడు. ఆఖరి ఓవర్‌లో విజయానికి ఐదు పరుగులు కావాల్సిన సమయంలో 16 బంతుల్లో 19 పరుగులు చేసిన గ్లెన్ ఫిలిప్స్ అవుటయ్యాడు. ఆ తర్వాత షారూఖ్ ఖాన్, తెవాటియా మ్యాచ్‌ని ముగించారు. తెవాటియా 7, షారూఖ్ 3 పరుగులు చేయడంతో 19.4 ఓవర్లలో విజయం సాధించింది. ఈ విజయంతో గుజరాత్ హ్యాట్రిక్ విక్టరీ అందుకుంది.

# వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

మొదటి తరువాయి

బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం.



లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గట్టెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోదీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

# రాహుల్ నేతృత్వంలో విపక్షాలు ఐక్యత చాటాయి

మొదటి తరువాయి

రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. విపక్ష నేతలందరూ ఏకమై ఒక 'జాతీయ విపత్తును' నివారించారని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన సందేశంలో ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావించారు. భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చిరస్థాయిగా నిలిచిపోయే ఒక మరపురాని రోజని సీఎం అభివర్ణించారు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావడంపై రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతే ఈ విజయాన్ని సాధించిందని తెలిపారు. ఈ బిల్లులను 'నల్ల బిల్లులు'గా పేర్కొంటూ.. వీటిని ఓడించేందుకు కఠిన పరిస్థితుల్లోనూ సాహసంతో నిలబడినందుకు విపక్ష కూటమిలోని మిత్రపక్షాల నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోరాటంలో అండగా నిలిచిన దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులందరినీ సీఎం రేవంత్ రెడ్డి పేరుపేరునా ప్రస్తావించారు. వీరిలో ఎం.కే. స్టాలిన్ తమిళనాడు, మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్, అఖిలేశ్ యాదవ్, ఉత్తర్ ప్రదేశ్ శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే (మహారాష్ట్ర), లాలు ప్రసాద్ యాదవ్ బిహార్ ,హేమంత్ సోరెన్ జార్ఖండ్, అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ వీరితో పాటు ఫరూఖ్ అబ్దుల్లా, నవీన్ పట్నాయక్, కమ్యూనిస్ట్ పార్టీల నాయకులకు కూడా ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రకటన జాతీయ రాజకీయాల్లో తెలంగాణ పోషిస్తున్న క్రియాశీలక పాత్రను స్పష్టం చేస్తోంది. ఈ బిల్లు వీగిపోవడం కేంద్ర ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బగా విపక్షాలు భావిస్తున్నాయి. దక్షిణాది నుంచి రేవంత్ రెడ్డి జాతీయ స్థాయి మిత్రపక్షల నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకమవ్వడం శుభ పరిణామమని సీఎం అభిప్రాయపడ్డారు. ఇదిలావుంటే భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా.. ఢిల్లీలోని అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాధాకృష్ణన్ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతిగా సేవలందించారన్నారు. భారతదేశం గర్వించదగ్గ గొప్ప తత్వవేత్త, విద్యావేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

మొదటి తరువాయి

మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని




తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళు తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# పదేళ్ల అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు

మొదటి తరువాయి

స్పష్టం చేశారు. పోలీసులు తమను అరెస్టు చేశారని.. రైతులకు మద్దతుగా తాము నిలిచామని తెలిపారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఏ విధంగానైతే పోరాటం చేశామో...అదే విధంగా పరిగిలో కూడా పోరాటం చేశానని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా పోరాటం చేస్తానని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో అన్నివర్గాలకు అధికారం రావాలన్నదే తన ధ్యేయమని వ్యాఖ్యానించారు. అందరికీ అధికారమని మాట్లాడుతారని.. దీనిని ఆచరణలోకి తీసుకురావాలని తాను ప్రారంభించాకే తనకు కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి పెట్టబోయే పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ఇచ్చారని తెలిపారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో కవితను పలువురు కలిశారు. ఆమెను కలిసిన వారిలో



సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు ఉన్నారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ప్రతి కష్టాన్ని పాఠంగా భావిస్తూ.. సామాజిక తెలంగాణ సాధించే వరకు పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు. సర్వోదయ తెలంగాణ తన లక్ష్యమని.. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. మారోజు వీరన్న అనుచరుల మద్దతు ఎంతో శక్తిని ఇస్తుందని అన్నారు. తమతో మారోజు వీరన్న అనుచరులు కలవటమంటే ఇక తమను ఆపే శక్తే లేదని పేర్కొన్నారు. ఏదైనా శని ఉంటే.. అది తొలగిపోవడం కోసమే తాను వారణాసి వెళ్లి పూజలు చేశానని ప్రస్తావించారు. తాను పెట్టే పార్టీ సక్సెస్ కావాలని కోరుకున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనను కలిశారని.. పేర్లు మాత్రం తాను బయటకు చెప్పనని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్‌ను ముందుగా టార్గెట్ చేశానని తెలిపారు. తనను ఆ పార్టీ సస్పెండ్ చేసిందని కవిత ప్రస్తావించారు.

## అంబానీని మించిన అదానీ

### ఆసియాలోనే టాప్ కుబేరుడిగా చోటు



ముంబయి :

అదానీ గ్రూపు చైర్మెన్ గౌతం అదానీ సంపదలో ముకేశ్ అంబానీని దాటేశారు. ఇటీవల అదానీ గ్రూప్ షేర్లు మార్కెట్‌లో దూసుకుపోవడంతో గౌతమ్ అదానీ తన చిరకాల ప్రత్యర్థి ముకేశ్ అంబానీని వెనక్కి నెట్టి ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా అవతరించారని బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ వెల్లడించింది. ఈ రిపోర్ట్ ప్రకారం.. అదానీ నికర విలువ 92.6 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.5లక్షల కోట్లు)కు చేరుకోగా.. అంబానీ 90.8 బిలియన్ డాలర్ల (8.40 లక్షల కోట్లు)తో తర్వాతి స్థానానికి పడిపోయారు. కేవలం ఒక్క రోజులోనే అదానీ తన సంపదకు 3.56 బిలియన్లు (రూ.33వేల కోట్లు) జోడించుకోవడం గమనార్హం. అంతర్జాతీయంగా అదానీ ర్యాంక్ 19గా, అంబానీ ర్యాంక్ 20గా ఉంది. టాప్ 500లో 23 మంది భారతీయ పెట్టుబడిదారులున్నారు. అధిక ధరలతో సామాన్యుడి జేబు ఖాళీ అవుతున్న వేళ.. బిలియనీర్ల ఆస్తుల పెరుగు దలపై జరుగుతున్న చర్చ ఆర్థిక నిపుణుల్లో ఆలోచన రేకెత్తిస్తోంది. పెరుగు తున్న ద్రవ్యోల్బణం, చమురు ధరల అస్థిరత, తగ్గుతున్న కొనుగోలు శక్తి కారణంగా సామాన్యుల పొదుపు హరించుకుపోతోంది. ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్న తరుణంలో సగటు భారతీయుడి వాస్తవ ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో వృద్ధి చెందకపోవడం గమ నార్హం.ఈ ఏడాదిలో ఇప్పటి వరకు అదానీ సంపద 8.1 బిలియన్ డాలర్లు పెంచుకున్నారు. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్ 20 కుబేరులలో ఏడుగురు నష్టాలను చవి చూశారు. అంబానీ సంపద కూడా 16.9 బిలియన్ డాలర్ల మేర తగ్గింది. అయినప్పటికీ వీరిద్దరి మధ్య ఉన్న పోటీ కేవలం 1.8 బిలియన్లకే పరిమితమైంది. స్టాక్ మార్కెట్ ఒడిదు డుకులపై ఆధారపడి సాగే ఈ నంబర్ వన్ పోరులో సామాన్యుల భాగ స్వామ్యం మాత్రం వరుస నష్టాలతో ఆందోళకరంగా ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందని ఒకవైపు గణాంకాలు చెబుతున్నప్పటికీ ఆ సంపద కేవలం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందనే ఆందోళన ఆర్థిక నిపుణుల్లో వ్యక్తమవుతోంది. అదానీ, అంబానీల మధ్య సాగుతున్న ఈ సంపద యుద్ధం అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్టను పెంచుతు న్నట్లు కనిపిస్తు న్నప్ప టికీ, క్షేత్రస్థాయిలో సామాన్యుడి కష్టాలు, ఆదాయ అసమానతలు మాత్రం ఇంకా సవాలుగానే మిగిలి ఉన్నాయి. ఈ సంపద కేంద్రీకరణ సంకేతాలు భవిష్యత్తులో సామాజిక, ఆర్థిక అంతరాలను పెంచుతాయనేది సుస్పష్టం.

## 'టైమ్' ప్రభావశీలుల జాబితా విడుదల

మొదటి తరువాయి


మ్యాగజైన్ 2026 ఏడాదికి గానూ 'టైమ్ 100 ప్రభావశీలుల జాబితా'ను విడుదల చేసింది. ఈ జాబితాలో ప్రపంచ రాజకీయాలు, వ్యాపారాలు, సాంకేతికత, కళలు, సామాజిక రంగాల్లో ప్రభావం చూపిన వంద మంది ప్రముఖుల పేర్లు ఉన్నాయి.

కనిపించని మోడీ పేరు

ఈ జాబితాలో భారత ప్రధాని మోడీ పేరు కనిపించలేదు. అయితే పొరుగుదేశాలైన నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహ్మాన్‌లు ఈ జాబితాలో పేర్లు సంపాదించారు. న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ వంటి నాయకులు చోటు సంపాదించారు. ట్రంప్, జిన్‌పింగ్‌లతో పాటు ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, క్యాథలిక్ చర్చ్ హెడ్ పోప్ లియో 14, కెనడా ప్రధాని మార్క్ కార్నీ, మెక్సికో ప్రెసిడెంట్ క్లాడి యా షీన్‌బామ్, జపాన్ ప్రధాని సనై తకైచీ, కాలిఫోర్నియా గవర్నర్ గవీన్ న్యూసామ్, యూఎస్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, యూఎస్ సెనెటర్ మార్క్ కెల్లీ వంటి నాయకులు ఈ ప్రభావశీలుల జాబితాలో ఉన్నారు.

## సంపాదకీయం

# అగ్ని గండం!





భానుడి భగభగలు రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇవి భవన నిర్మాణ కార్మికులు, దినసరి కూలీలు, చిరు వ్యాపారుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే సాధారణంకంటే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవ్వడం ఆందోళన కలిగించే అంశం. ఇప్పటికే వడదెబ్బతో జిల్లాల్లో నలుగురు మృతిచెందినట్టు వార్తలు. గురువారం ఒక్కరోజే ముగ్గురు చనిపోవడం, వారిలో ఓ మహిళా ఉపాధి కూలీ ఉండటం బాధాకరం. పనికి వెళ్లకపోతే పస్తులు, వెళ్తే ప్రాణం కోల్పోవడం అన్నట్టుగా ఉందీ పరిస్థితి. పదిజిల్లాల్లో 44డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వెదర్ రిపోర్టు వెల్లడించింది. మరో నాలుగురోజుల వరకు ఇదే పరిస్థితి ఉండనుందని, ప్రజలు బయటకు రావద్దని ప్రభుత్వం హెచ్చరించింది. ముప్పై జిల్లాలకు హైదరా బాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్ విధించింది. ఓవైపు ఎండలు దంచికొడు తుంటే, మరోవైపు అక్కడక్కడ చిరు జల్లులతో భూమి మరింత వేడెక్కింది. ఇది కొన్నిచోట్ల వ్యవసాయంపై ప్రతికూలత చూపగా పౌల్ట్రీ రంగంపై దీని ప్రభావం మరింత ఉంది. ఎండవేడికి కోళ్లు చనిపోవడం ప్రత్యక్షంగా యజమానులకు, పరోక్షంగా కార్మికులకు దెబ్బ. గతేదాడి ఇదే సమయానికి నలభై డిగ్రీల చుట్టూ నమోదైన ఉష్ణోగ్రతలు, ఈసారి నలభై ఐదు డిగ్రీలకు ఎగబాకడం తెలంగాణలో వాతావరణ సంక్షోభాన్ని ఎత్తిచూపుతోంది. మేలో రావాల్సిన ఎండలు ఏప్రిల్‌లోనే దాడిచేయడం ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. 2025 ఏప్రిల్ మధ్యలో చాలా జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 42 వద్దే ఆగాయి. కానీ, ఈ సారి దాదాపు అన్ని జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లాలో 45కి దగ్గరవ్వడం వాతావరణ హెచ్చుతగ్గులుగా చూడకూడదు, ఇది ఒక విపత్తు. తెల్లారితేచాలు ఉరుకుల పరుగుల జీవనంలో బతికే హైదరాబాద్ మహానగరంలో కూడా గతంతో పోలిస్తే రెండు డిగ్రీలు పెరిగాయి. ఎండలు ఇంతలా మండిపోవడానికి వాతావరణ మార్పు ఒక కారణమైతే, రెండోది అడవుల నరికివేత, చెరువుల మాయం, భూగర్భ జలాల క్షీణత. ఇంకా చెపాల్సివస్తే కాంక్రీట్ నగరాలు, రాజ ధాని సహా పట్టణాల్లో చెట్లు తగ్గి, సిమెంట్ బిల్డింగ్స్, గాజు భవనాల పెరుగుదల. దీంతోనే 'హీట్ ఐలాండ్ ఎఫెక్ట్' తీవ్రమవు తోందని పలు నివేదికలు చెబుతున్నాయి. ఇది అభివృద్ధే కదా అన్న వాదనలున్నా దీని సమతుల్యతను పాటించడంలో ప్రభుత్వాలు ఉదాసీనతను ప్రదర్శిస్తున్నాయి. ఫలితంగా ఎండకాలంలో ఎండలు, వానాకాలంలో వానలు విపరీతమై ప్రజల్ని చుట్టుముడు తున్నాయి. మరి పాలకులు ఏం చేస్తున్నట్టు? వారికి బాధ్యతేం లేదా?- ఎవరికైనా సహజంగా ఉత్పన్నమయ్యే ప్రశ్నలు. 'ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఎండలకు బయటకు రాకండి' వంటి ప్రకటనలకు పరిమితమైతే శ్రమజీవుల జీవితాలు ఏం కావాలి? కుటుంబపోషణ కోసం పనిచేయకుంటే వారి ఆకలి ఎలా తీరుతుంది? పనిప్రదేశాల్లో వసతులు కల్పించడం, ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టడం, సమయపాలన మార్చడం చాలా ముఖ్యం. కానీ, ఈ చర్యలకు ప్రభుత్వం పూనుకోవడం లేదు. పైకి ఎన్ని జాగ్రత్తలు చెప్పినా ప్రజల్ని 'ఎండ'లకు వదిలేసి పిట్టల్లా రాలుతుంటే చోద్యం చూడటం సరికాదు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కుట్లపల్లికి చెందిన రుక్కమ్మ ఉపాధి కూలీకి పోయి మధ్యాహ్నం ఇంటికొచ్చిన కాసేపటికే వాంతులు చేసుకుని చనిపోయింది. ఆమెకు కొడుకు, ఇద్దరు కూతుళ్లు. వారిని దిక్కెవరు? వ్యవసాయ కూలీలు, రైతులదీ ఇదే పరిస్థితి. వేసవికి ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టచ్చినట్టు కనిపిస్తోంది. ఉద్యోగుల పరిస్థితి కూడా భిన్నమేమి కాదు, బస్సుల కోసం గంటల తరబడి నిలబడటం, ట్రాఫిక్‌లో చిక్కుకోవడం, ఎండలో తిరిగే ఫీల్డ్‌స్టాఫ్, పోస్టుమేన్, లైన్‌మెన్, పోలీస్ సిబ్బంది-అందరూ వేడితీవ్రతను భరిస్తున్నారు. కాలేజీలు, హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో సరైన తాగునీరు, కూలింగ్ సదుపాయలు కూడా అరకొరగానే ఉన్నాయి. సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. వారు ఆరోగ్యంగా ఉంటేనే ప్రభుత్వ ఆదాయానికి, అభివృద్ధికి సహకరిస్తారు. నగరంలో వాహనదారులు, ఆటోడ్రైవర్లు, ట్రాఫిక్ పోలీసుల పరిస్థితి ఈ ఎండలో మరీ భయానకం. సిగల్ పడగానే రెండు మూడు నిమిషాలు వాహనాలు ఆపాల్సి ఉంటుంది. మధ్యాహ్నం వేడిగాలి భరించలేనిది. ట్రాఫిక్ కూడళ్ల వద్ద చలువ పందిళ్లు వేసి, ప్రజల్ని రక్షించాలనే నిబంధలున్నా సర్కార్ పట్టించుకోవడం లేదు. అక్కడక్కడ స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు, మజ్జిగ పంపిణీ అభినందనీయం. ఏప్రిల్‌లోనే ఎండలిలా ఉంటే మేలో తలచుకుంటేనే ఆందోళనగా ఉంది. తాత్కాలిక చర్యలు ఎన్ని చేపట్టినా ప్రజలు, ప్రభుత్వం పర్యావరణాన్ని కాపాడుకోకపోతే ప్రకృతి వైపరీత్యాలు వస్తూనే ఉంటాయి. మళ్లీమళ్లీ మనకు నష్టం చేస్తూనే ఉంటాయి.

## ఇంటర్మీడియట్ ఫలితాల్లో
# సత్తా చాటిన హోమ్ గార్డ్ కుమార్తె

**-రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించిన కుమారి నిమిత.**
**-992 మార్కులు సాధించిన విద్యార్థినిని ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపిఎస్.**





**కామారెడ్డి ఏప్రిల్ 17 (మహాప్రభ)** కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోమ్ గార్డ్ బి. సిద్దరాములు గారి కుమార్తె కుమారి బి. నిమిత ఇంటర్మీడియట్ ఫలితాల్లో అసాధారణ ప్రతిభను కనబరిచారు. మొత్తం 1000 మార్కులకు గాను 992 మార్కులు సాధించి, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్‌ను కైవసం చేసుకోవడం విశేషం. ఈ అద్భుత విజయం పట్ల జిల్లా ఎస్పీ హర్షం వ్యక్తం చేస్తూ, కుమారి నిమితను మరియు ఆమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ విద్యార్థినిని శాలువాతో మరియు జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. నిమిత సాధించిన ఈ విజయం ఆమె అకుంఠిత దీక్షకు, పట్టుదలకు మరియు తల్లిదండ్రుల ప్రోత్సాహానికి నిదర్శనమని ఆయన కొనియాడారు. ఇలాంటి విజయాలు జిల్లా పోలీస్ కుటుంబాలకే కాకుండా, తోటి విద్యార్థులందరికీ గొప్ప స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. నిమిత భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజానికి మంచి సేవలు అందించాలని జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది ఆకాంక్షించారు.

# గౌడ జనాభాను తగ్గించి చూపిస్తున్నారంటూ
# జై గౌడ ఉద్యమం ఆరోపణలు

**-అసమగ్ర సర్వే రిపోర్ట్‌పై మండిపడ్డ జై గౌడ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోళ్ళ మురళి గౌడ్**





**కామారెడ్డి, ఏప్రిల్ 17: (మహాప్రభ)** రాష్ట్రంలో గౌడ కుల జనాభాను కావాలనే తగ్గించి చూపిస్తూ రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం జరుగుతోందని జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోళ్ళ మురళి గౌడ్ ఆరోపించారు. ఇటీవల విడుదలైన సమగ్ర సర్వే నివేదికలో గౌడ కుటుంబాల సంఖ్యను వాస్తవానికి విరుద్ధంగా చూపించారని ఆయన విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు ఉన్న గౌడ సమాజాన్ని కేవలం తక్కువ సంఖ్యలో ఉన్నట్లు పేర్కొనడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు.గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో ఎక్కడ చూసినా గౌడల సంఖ్య గణనీయంగా కనిపిస్తుందని, అలాంటి పరిస్థితిలో వారిని మైనార్టీ వర్గంలా చూపించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. గౌడ సమాజం బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, బహుజన వర్గాల గొంతు మరింత బలంగా వినిపిస్తుందని పేర్కొన్నారు. అందుకే ఆ వర్గాన్ని బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

చరిత్రను విస్మరించొద్దని వ్యాఖ్య గౌడ సమాజం చరిత్రాత్మకంగా పోరాట స్ఫూర్తి కలిగిన వర్గమని మురళి గౌడ్ అన్నారు. మహారాజ్ పాపన్న గౌడ్ కాలం నుంచే దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా గౌడలు పోరాడారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యోద్యమం, రజాకారుల వ్యతిరేక పోరాటం, తెలంగాణ ఉద్యమాలు, సామాజిక న్యాయ పోరాటాల్లో గౌడల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆలయాలు, విగ్రహాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ఉద్యమాలకు గౌడ సమాజం ఆర్థికంగా అండగా నిలిచిందని చెప్పారు. కష్టపడి సంపాదించిన సంపదను సమాజ హితానికి వినియోగించిన వర్గం గౌడలేనని పేర్కొన్నారు. ఆర్థిక మూలాలపై దాడి చేశారంటూ ఆరోపణ గౌడల సంప్రదాయ వృత్తి అయిన కల్లు, తాటి, ఈత చెట్ల ఆధారిత జీవన విధానాన్ని గత దశాబ్దాలుగా దెబ్బతీసే ప్రయత్నాలు జరిగాయని ఆయన ఆరోపించారు. వృత్తిని బలహీనపరిస్తే సమాజాన్ని బలహీనపరచవచ్చనే ఉద్దేశంతో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. ప్రమాదాలకు గురైన గౌడ కార్మికులకు సరైన పరిహారం ఇవ్వడం లేదని, యువతకు విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కూడా పరిమితమవుతున్నాయని అన్నారు.గ్రామాల వారీగా నివేదిక విడుదల చేయాలని డిమాండ్

జనాభా లెక్కలపై అనుమానాలు నివృత్తి చేయాలంటే గ్రామాల వారీగా, మండలాల వారీగా పూర్తి నివేదిక విడుదల చేయాలని మురళి గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి గణాంకాలు మాత్రమే వెల్లడించడం ద్వారా వాస్తవాలను దాచిపెడుతున్నారని ఆరోపించారు. ప్రతి గ్రామంలో ఏ కులం ఎంత జనాభా కలిగి ఉందో స్పష్టంగా ప్రకటిస్తే అసలు నిజాలు బయటపడతాయని అన్నారు.బహుజన వర్గాలు ఐక్యంగా ఉండాలన్న పిలుపు ఈరోజు గౌడ సమాజంపై జరిగిన అన్యాయం రేపు ఇతర బీసీ, బహుజన వర్గాలపై కూడా జరగవచ్చని ఆయన హెచ్చరించారు. యాదవ్, ముదిరాజ్, పద్మశాలి, మున్నూరు కాపు తదితర వర్గాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జనాభా ఆధారిత హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కోసం అన్ని బహుజన వర్గాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గౌడ సమాజాన్ని తక్కువ చేసి చూపించే ప్రతి ప్రయత్నాన్ని తిప్పికొడతామని, నిజమైన గణాంకాలు వెలుగులోకి వచ్చే వరకు ఉద్యమం కొనసాగిస్తామని మురళి గౌడ్ స్పష్టం చేశారు.

## రాత్రుల్లో అక్రమ మట్టిని తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్న పోలీసులు







**తూప్రాన్, ఏప్రిల్ 17 (మహా ప్రభ)** అర్ధరాత్రి అక్రమంగా వెంకటాపూర్ మరియు బ్రాహ్మణపల్లి లోని మట్టి మాఫియా కొందరు మట్టిని తరలిస్తుండగా టిప్పర్లను పట్టుకున్న తూప్రాన్ ఎస్సై గంగరాజు పోలీసు సిబ్బంది. తూప్రాన్ మున్సిపల్ పరిధి టాటా కాఫీ వెనుక భాగంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గుట్టల నుండి రాత్రుల్లో జెసిబిల సహాయంతో మట్టిని త్రవ్వి అక్రమంగా అమ్ముకుంటూ లక్షలు దండుకుంటున్న మట్టి దొంగలు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న సమయంలో ఎవరైనా పర్మిషన్ ఉందా అంటే వారిని బెదిరిస్తున్నారు, లేదా ప్రలోభాలకు గురి చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని మట్టి టిప్పర్ లను పట్టుకొని అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఇందులో భాగంగా టిప్పర్ యజమాని పై కేసు నమోదు చేసామని ఎస్ఐ గంగరాజు తెలిపారు.

## నాలుగో వార్డ్ లో స్పెషల్ డ్రైవ్.

**పరిసరాల పరిశుభ్రతే ప్రజల ఆరోగ్యం- కౌన్సిలర్ జైపాల్ నాయక్.**



**మెదక్ జిల్లా -17ఏప్రిల్ )మహాప్రభ )** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ లోని నాలుగో వార్డ్ లో ప్రజా పాలన భాగంగా స్పెషల్ డ్రైవ్ శుక్రవారం నిర్వహించారు.మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ జైపాల్ నాయక్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రజల ఆరోగ్యం అని ప్రజలందరూ చుట్టుప్రక్కల అంత శుభ్రత ఉంచి బహిరంగ ప్రదేశాలలో చెత్త చేయవద్దని మునిసిపల్ సిబ్బందికి సహకరించాలని ప్రజలు కూడా భాగస్వాములు కావాలని అప్పుడే పరిశుభ్రతకు సాధ్యమవుతుందని ప్రజలకు సూచించారు.మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి మాట్లాడుతూ తూప్రాన్ మున్సిపాలిటీ పరిశుభ్రతలో అందరికీ ఆదర్శవంతంగా ఉండాలని ప్రజల సహకారం కూడా అవసరమని చుట్టుపక్కల పిచ్చి మొక్కలు ఉండకూడదని దోమలు వ్యాపించి ప్రజలు అనారోగ్యం పాలవుతారని కాబట్టి మనిషి భద్రత ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ప్రజలకు సూచించారు మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్ మాట్లాడుతూ పరిశుభ్రత ఉంటే ప్రజలందరూ ఆరోగ్యంగానే ఉంటారని ఎండాకాలం దృశ్య సిబ్బంది కూడా ఎండను చూసి పని చేసుకోవాలని అలాగే ప్రతి వార్డులో సైనిటైజర్ తప్పనిసరి ఉండాలని ప్రజల ఆరోగ్యం ఎంత ముఖ్యమో పరిశుభ్రత కూడా అంతే ముఖ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ షర్మిల రాములు మున్సిపల్ శానిటైజర్ ఆఫీసర్ మధు ఎలక్ట్రిషన్ ఆఫీసర్ సంతోష్ రెడ్డి జవాన్ ఇర్ఫాన్ వినోద్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# టీజీజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు

**- మండల అధ్యక్షుడు జ్ఞానేశ్వర్**

**గాంధారి, ఏప్రిల్ 17 (మహాప్రభ)** కామారెడ్డి జిల్లా గాంధారి మండలం కేంద్రంలో జిల్లా ఉన్నత పాఠశాలలో పి ఆర్ సి వెంటనే అమలు. పెండింగ్ డి ఏ చెల్లించాలని టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్ అన్నారు. గాంధారి మండలంలోని టీజీజేఏసీ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాంధారి ఉన్నత పాఠశాల లో పి ఆర్ సి వెంటనే అమలు, పెండింగ్ డిఏ బిల్లులు వెంటనే చెల్లించాలని ఉద్యోగులు సమస్యలు అన్నింటినీ పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినారు .. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు టీపీటీఫ్ మండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..



# డ్వాక్రా సంఘాలకు డిజిటల్ సేవలు

**సంఘమిత్రలకు మొబైల్ ఫోన్లు అందజేసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం**

**ఏప్రిల్ 17 తిరుపతి జిల్లా (సత్యవేడు)మహాప్రభ ప్రతినిధి...**

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో డ్వాక్రా మహిళల సాధికారతకు ప్రభుత్వం మరో అడుగు ముందడుగు వేసింది. మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత డిజిటల్ దిశగా తీసుకెళ్లేందుకు సంఘమిత్రలకు ఉచిత మొబైల్ ఫోన్లను అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని సంఘమిత్రలకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళా సంఘాల అభివృద్ధిలో సంఘమిత్రలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. డ్వాక్రా సంఘాల పొదుపులు, రుణాల వసూళ్లు, బ్యాంకు లావాదేవీలు వంటి అంశాల్లో



సంఘమిత్రలు మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే సంఘమిత్రల సేవలు చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రతి పది సంఘాలకు ఒక ఈ--నారీని నియమించి "మన డబ్బులు -- మన లెక్కలు" యాప్ ద్వారా అన్ని లావాదేవీలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి మొబైల్ ఫోన్లను అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అంతేకాకుండా మహిళా సంఘాలు కేవలం పొదుపుకే పరిమితం కాకుండా చిన్న పరిశ్రమలు, వ్యాపార రంగాల్లోకి అడుగుపెట్టి ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 271 మంది సంఘమిత్రలకు సాంసంగ్ మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఫోన్లతో పాటు స్క్రీన్ గార్డ్, పౌచ్, ట్యాగ్ వంటి ఉపకరణాలను కూడా అందజేశారు సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, కెవిబి పురం, వరదయ్యపాలెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలకు చెందిన సంఘమిత్రలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలాల వెలుగు ఏపీఎంలు, కోఆర్డినేటర్లు, సీసీలు మరియు మహిళా సంఘాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

# ప్రమాదాల నివారణకు రోడ్డు పరిశీలన





**తాడ్వాయి ఏప్రిల్ 17 (మహాప్రభ)**

తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో శబరి ఆలయం నుంచి దేవాయిపల్లి స్టేజ్ వరకు ఉన్న ప్రధాన రహదారిని ప్రమాదాల నివారణ దృష్ట్యా అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. సీసీ ఎస్ ఎస్ నగర్ సీఐ, తాడ్వాయి ఎస్ఐల, వినతిపై ఆర్‌టీఏ కమారెడ్డి అధికారి శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ, ఏఈ రవితేజతో, పాటు మోటార్ వాహన పరిశీలకులు శంకర్, మధుకర్, బృందంగా పర్యటించారు. ఈ సందర్భంగా రహదారిపై ప్రమాదాలకు దారితీసే సమస్యలను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా రోడ్డు మలుపులు, గుంతలు, సూచిక బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించారు.పరిశీలన అనంతరం సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి, త్వరితగతిన అవసరమైన చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

# గురుకుల ఉపాధ్యాయ డిమాండ్లను పరిష్కరించాలి

**యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీను**

**దేవరకొండ ఏప్రిల్ 17( మహాప్రభ )**

TGEJAC పిలుపు మేరకు గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో దేవరకొండ లోని అన్ని గురుకుల పాఠశాలలో నల్లటి బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు . ఈ నిరసన కార్యక్రమంలో గురుకుల యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొండ్రపల్లి శ్రీను మాట్లాడుతూ తక్షణమే 2వ పిఆర్సి ని అమలు చేయాలని ,పెండింగ్లో ఉన్న డి ఏ లను విడుదల చేయాలని, సిపిఎస్ ను రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని, ఆశాస్త్రీయంగా ఉన్న గురుకుల సమయవేళల్లో మార్పు తేవాలని , 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వం ఇటీవల



ప్రతిపాదించిన ఈ హెచ్ ఎస్ కార్డులు గురుకుల ఉపాధ్యాయులకు వెంటనే మంజూరు చేయాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులకి ముఖ్య కర్తవ్యం బోధన కాబట్టి వార్డెన్ మరియు అడ్మినిస్ట్రేషన్ విధుల నుండి విముక్తి కల్పించాలని, కేర్ టేకర్స్ నియమించాలని ,హాలిడే డ్యూటీలో విధులు నిర్వహించిన వారికి సిసిఎల్ మంజూరు చేయాలని, తెలిపారు అర్హులైన ఉద్యోగులకు గెజిటెడ్ హోదా కల్పించాలని, వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు అడ్మిషన్స్ నుండి విముక్తి కల్పించాలని ఒకవేళ తప్పనిసరి అయితే అడ్మిషన్స్ డ్యూటీ నిర్వర్తించిన వారికి మరియు క్యాంపు వెళ్లిన వారికి ఈయల్స్ ఇవ్వాలని దానితో పాటు టీ ఏ, డి ఏ మంజూరు చేయాలని , గెస్ట్ టీచర్లకు 12 నెలల వేతనం అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉపాధ్యాయుడు వీధిలో ఉండి ఆరోగ్యం సహకరించకపోయి,మరణిస్తే ఆయా సొసైటీలు బాధ్యత తీసుకొని వెంటనే స్పందించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెగావత్ శంకర్, ఏడుకొండలు,సంధ్య, సమీన,శ్రీశైలం,మహేష్ , వెంకటేశ్వర్లు ,గిరి, రవి తదితర ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఇంటర్ బైపిసి లో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన భూషరాజు దీపిక

**ఎంజెపి సిఓఈ కళాశాలలో మొదటి సంవత్సరం లోనే మంచి ఫలితాలు**

**దేవరకొండ ఏప్రిల్ 16( మహాప్రభ )**



దేవరకొండ పట్టణానికి చెందిన భూషరాజు దీపిక ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపిసి విభాగంలో 437/440 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంక్ ను సాధించింది. పేదరికం విద్యకు అడ్డు కాదని నిరూపిస్తూనే సరూర్నగర్ ఎం జె పి సి ఓ ఈ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించి సరస్వతీ రాష్ట్రస్థాయిలో ర్యాంకును సాధించింది. తల్లిదండ్రులు భూష రాజు రాములు మంగమ్మ లు సైతం తన కుమార్తె సాధించిన మార్కుల పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రశ్మిత విద్యార్థిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేసింది.

# కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్యాయత్నం

**-పోలీసులు అప్రమత్తతతో ప్రాణాపాయం తప్పింది**

**కామారెడ్డి ఏప్రిల్ 17 (మహా ప్రభ)**



కామారెడ్డి పట్టణ పరిధిలో శుక్రవారం సాయంత్రం కుటుంబ సమస్యలతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు సమయానికి స్పందించి ఆమెను రక్షించడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసుల వివరాల ప్రకారం... లింగాపూర్ గ్రామానికి చెందిన చింతపంటి శోభ (38) కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురై, తహేర్ గార్డెన్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. సమాచారం అందుకున్న వెంటనే కానిస్టేబుళ్లు రామకృష్ణ, నర్సింలు సంఘటనా స్థలానికి చేరుకుని అప్రమత్తంగా వ్యవహరించి ఆమెను సురక్షితంగా రక్షించారు.తరువాత ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించి, కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సమస్యలు ఎదురైనపుడు ఆత్మహత్య వంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా, సమీప బంధువులు, స్నేహితులు లేదా అధికారులను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

# సౌత్ జోన్ ఫెస్టివల్‌లో సాయికిరణ్ ప్రతిభ, తెలుగు విశ్వవిద్యాలయంలో సత్కారం

**- సౌత్ జోన్ ఫెస్టివల్‌లో సాయికిరణ్ ప్రతిభకు ఘనంగా గుర్తింపు.**

**హైదరాబాద్ - ఏప్రిల్ 17 ( మహాప్రభ )**



సూరవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విభాగంలో అభ్యసిస్తున్న విద్యార్థి బి. సాయికిరణ్ ప్రతిభతో మరోసారి గుర్తింపు పొందారు.గత సంవత్సరం డిసెంబర్‌లో చెన్నైలో నిర్వహించిన సౌత్ జోన్ ఫెస్టివల్ లో సాయికిరణ్ వన్ యాక్ట్ ప్లే, మైమ్, క్రియేటివిటీ కొరియోగ్రఫీ విభాగాల్లో పాల్గొన్నారు. అందులో వన్ యాక్ట్ ప్లేలో నాలుగో స్థానం సాధించగా, మైమ్‌లో ప్రధాన పాత్ర పోషించి నాలుగో స్థానం పొందారు.ఈ సందర్భంగా గురువారం రోజు సూరవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో మహనీయుల జయంతి వేడుకల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు చేతుల మీదుగా సాయికిరణ్ సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావు,రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతు రావు, సినీ నటుడు ప్రదీప్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ కృపాకర్ పాల్గొన్నారు. విద్యార్థి సాయికిరణ్ సాధించిన విజయానికి విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ విభాగాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# 20వ వార్డులో సీసీ రోడ్డు పనులను పరిశీలించిన: ఎమ్మెల్యే



**దేవరకొండ ఏప్రిల్ 17( మహాప్రభ )**

దేవరకొండ పట్టణంలోని 20వ వార్డులో ఏర్పాటుచేసిన సిసి రోడ్లను పరిశీలించిన శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్. మున్సిపాల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు తో కలిసి వార్డులను పరిశీలించి ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆధార అభిమానాలు పొందినప్పుడే ప్రజాప్రతినిధులకు నిజమైన సంతోషం ఉంటుందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు, డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, బిక్కు నాయక్, నారాయణ నాయక్, పట్టణ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# తహసీల్దార్ కార్యాలయానికి తపస్

**పాపన్నపేట, ఏప్రిల్ 17( మహా ప్రభ)**



ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కై తపస్ ఆధ్వర్యంలో శుక్రవారం పాపన్నపేట తహశీల్దార్ సతీష్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. తపస్ మండల అధ్యక్షుడు పైతర దుర్గాప్రసాద్ మాట్లాడుతూ .. పెండింగ్ సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని,జూన్ 2 వరకు పిఆర్సీ ప్రకటించి అమలు చేయాలన్నారు. సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలని,డిఏ లు,పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తపస్ మండల ప్రధాన కార్యదర్శి బోయినీ రాజశేఖర్,మెదక్ జిల్లా కోశాధికారి మంగ నర్సింలు,జిల్లా బాధ్యులు తులసి రామ్,నరేందర్ రెడ్డి,రమేష్,ఉపాధ్యాయులు నవీన్,వెంకటేష్,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# భోజన విరామ నిరసన

**- పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఉద్యోగుల డిమాండ్.**

**దేవరకొండ ఏప్రిల్ 17 ( మహాప్రభ)**

దేవరకొండ స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో దేవరకొండ యూనిట్ టీఎన్జీవో అధ్యక్షురాలు డి.రుణాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయ వివిధ కార్యాలయ సిబ్బంది నిరసన వ్యక్తం చేయడం జరిగింది.

ముఖ్యమైన డిమాండ్లు1. PRCని వెంటనే అమలు చేయాలి.

2. పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలి.

3. సిపిఎస్ ను రద్దు పరచి ఓ పి ఎస్ ను వెంటనే అమలు చేయాలి.

4. మిగతా 62 డిమాండ్లను అమలు పరచాలని నిరసన వ్యక్తం చేస్తూ ఆర్డీవో గారికి వినతి పత్రము సమర్పించారు. ఇట్టి కార్యక్రమంలో టీఎన్జీవో సెక్రటరీ జంగయ్య ,ట్రెజరర్ నాగరాజు మరియు నాలుగో తరగతి సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఇతర కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల్లో 'గోల్డెన్ అవర్' ప్రాముఖ్యతపై అవగాహన







**తాడ్వాయి ఏప్రిల్ 17 (మహా ప్రభ)**

తాడ్వాయి మండల కేంద్రంలో శుక్రవారం 'అరైవ్ అలైవ్' ప్రజా పాలన కార్యక్రమం భాగంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 108 సిబ్బంది ఈఎంటీ సత్యం, పైలట్ శ్రవణ్ కుమార్ ప్రజలకు ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత, ప్రథమ చికిత్స విధానాలపై వివరించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు సమయానికి చికిత్స అందితే ప్రాణాలను రక్షించవచ్చని, మొదటి గంట అత్యంత కీలకమని వారు తెలిపారు. ప్రమాద సమయంలో ఆందోళన చెందకుండా తక్షణమే 108 సేవలకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి ఎస్సై నరేష్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై అవగాహన కార్యక్రమాన్ని ఆసక్తిగా వినిపించారు.


## ఎంద్రియాల్‌లో అంగన్వాడీ, నర్సరీ, ఉపాధి పనుల స్థలాల పరిశీలన






**తాడ్వాయి ఏప్రిల్ 17 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం ఎంద్రియాల్ గ్రామంలో శుక్రవారం సీపీఓ అధికారి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, నర్సరీ, ఉపాధి హామీ పనుల (EGS) వర్క్‌సైట్‌ను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాల్సిందిగా సిబ్బందికి సూచించారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నర్సరీలో మొక్కల సంరక్షణ, పెంపకం విధానాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఉపాధి హామీ పనుల స్థలంలో పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి, ప్రస్తుత ఎండల తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీరు, విశ్రాంతి సమయాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సవిత కూడా పాల్గొని కూలీలతో కలిసి భోజనం చేశారు. అధికారులు, గ్రామ సిబ్బంది తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

## మదీనగూడ యూ-టర్న్ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు



**శేరిలింగంపల్లి -ఏప్రిల్ 17 (మహాప్రభ )**
శేరిలింగంపల్లి పరిధిలోని మదీనగూడ యూ-టర్న్ వద్ద రాంగ్ రూట్ డ్రైవింగ్, అక్రమ పార్కింగ్‌ను అరికట్టేందుకు మియాపూర్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో క్రాస్ బారియర్లు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించారు. పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ జీబ్రా క్రాసింగ్‌లు, సైనేజీలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా హఫీజ్‌పేట వద్ద కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ (FOB) నిర్మాణానికి సంబంధించి సంబంధిత అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌ఓ ప్రశాంత్ తెలిపారు. ప్రస్తుతం ఈ మార్గంలో సర్వీస్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయని, పాదచారులు తప్పనిసరిగా ఎఫ్‌ఓబీలను వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా వివిధ శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

## చేయూత... చిరునవ్వు... నమ్మకం... ధైర్యం



**కూకట్పల్లి, ఏప్రిల్ 17 (మహాప్రభ)**
కూకట్పల్లి నియోజకవర్గం,ప్రజల సమస్యల పరిష్కారమే రాజకీయాల అసలు లక్ష్యమని విశ్వసించే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోటుముక్కల వెంకటేశ్వరరావు మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ, వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్న ఆయనకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోంది. సాధారణ ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాకుండా, వాటికి తక్షణ పరిష్కారం చూపేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారు. అవసరమైన వారికి చేయూత అందిస్తూ, ఆశ నింపే చిరునవ్వుతో ధైర్యం కలిగించడం ఆయన ప్రత్యేకతగా మారింది. ఇటీవల నిర్వహించిన ప్రజా పరామర్శ కార్యక్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ వృద్ధుడికి సహాయం అందిస్తూ, ఆయన మానవత్వాన్ని మరోసారి ప్రతిబింబించారు. నాయకుడు ప్రజల మధ్య ఉండాలి, వారి అవసరాల సమయంలో అండగా నిలవాలి అనే భావనతో పనిచేస్తున్నారని స్థానికులు అభిప్రాయపడ్డారు. సామాజిక సేవే రాజకీయాల బలం అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్న గోటుముక్కల వెంకటేశ్వరరావు, ప్రజల్లో నమ్మకం కలిగించే నాయకుడిగా గుర్తింపు పొందుతున్నారు. ప్రజలకు చేయూతగా నిలుస్తూ, సమాజంలో ధైర్యం నింపే నాయకత్వాన్ని కొనసాగిస్తానని ఆయన తెలిపారు.

## భార్య హత్య కేసులో భర్త, కుమారుడి అరెస్ట్

**ఆళ్లగడ్డ ఏప్రిల్ 17 (మహాప్రభ)**
ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మండలం తువ్వపల్లెలో గత డిసెంబర్లో జరిగిన శెట్టి వరాలు మృతి కేసు హత్యగా తేలింది.
కుటుంబ కలహాల కారణంగా భర్త చంద్రుడు, కుమారుడు వెంకటరమణ ఆమెను గొంతు నులిమి చంపినట్లు ఎస్ఐ జయప్ప తెలిపారు. నిందితులు వీఆర్వో వద్ద లొంగిపోగా, వారిని సీఐ ముందు హాజరుపరిచి అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను రిమాండ్కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

# విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి

**- మెదక్ నియోజకవర్గ ఇంచార్జీ కంటా రెడ్డి తిరుపతి రెడ్డి.**




**మెదక్ జిల్లా -17ఏప్రిల్(మహాప్రభ ).**
విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు 10వ రోజైన శుక్రవారం రోజు తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టివిఏఈ జెఏసి) పిలుపు మేరకు ఆర్టిజన్లు నిరవధిక సమ్మె నిర్వహించారు.ఆర్టిజన్ల సమ్మెకు మెదక్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జీ కంటా రెడ్డి తిరుపతి రెడ్డి హాజరై సంఘీ భావం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ ల డిమాండ్లు న్యాయపరమైనవేనని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క యూనియన్ నాయకులతో చర్చలు జరిపి మీకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో తమ పార్టీ మీకు ఎప్పుడూ అండగా ఉంటుందని, ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఎండనక, వాననక, రాత్రింబవళ్ళు కష్ట పడి పనిచేసేది మీరైతే, ఉన్నతాధికారులు ఏసిలలో పడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేవలం రూ.30వేలతో బతుకులు నెట్టుకు రావటం చాలా చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి,మెదక్ పట్టణ అధ్యక్షులు మామూళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్ గౌస్ ఖురేషి,కల్వకుంట్ల సర్పంచ్ కొండలు రెడ్డి, మాజీ ఎంపీపీ అంజన్న,సతీష్ రావు,చందుగౌడ్,సాంగు స్వామి,చిన్నశంకరంపేట మండల వైస్ ప్రెసిడెంట్ బాగా రెడ్డి,మెదక్ నియోజకవర్గ నాయకులు గంజి నవీన్,మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు లాలు నాయక్,మందాపూర్ మాజీ సర్పంచ్ సుధాకర్,మాజీ కౌన్సిలర్ జయరాజు, గోపనీ సాయి,మహిళా ఆర్టిజన్లు సుమలత, జ్యోతి,ప్రణీత, నాగమణి,జెఏసి నాయకులు జంగం శరత్,పృథ్వీ గౌడ్,ప్రదీప్ గౌడ్, శ్రీశైలం, శ్రీనివాస్, బి.చంద్ర భానప్ప,బి.సంపత్ కుమార్, పాపయ్యోల రమేష్, వై.సంగమేశ్వరరెడ్డి, నాగరాజు, వెంకటచారీ, రాజుగౌడ్, మొగులయ్యా,బుస్ససత్యం గుప్తా, పోలశ్రీనివాస్ ,రమావత్ హరినాయక్,ఉపేందర్, రమావత్ గోపాల్ నాయక్, రమావత్ పూల్య నాయక్,వై. జైపాల్ రెడ్డి,యూసుఫ్,కిషన్,అశోక్, మోహన్,పరశురామ్,నర్సింలు, సుధాకర్, సాయిలు,యాదగిరి, సూర్య రమేష్,శ్రీనివాస్ రెడ్డి,ప్రభాకర్, గంగారం, ప్రవీణ్,మఠం సంగమేశ్వర తదితరులు పాల్గొన్నారు.నిరవధిక సమ్మెలో భాగంగా మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి తమ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# పంచాయతీరాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలి

**-సమ్మర్ యాక్షన్ ప్లాన్ తో గ్రామాలలో డ్రింకింగ్ వాటర్ సమస్యలను నిర్మూలించాలి**
**-15వ ఆర్థిక సంఘం విధుల వినియోగంపై సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు వర్క్ షాప్ నిర్వహణ.**
**-మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ జిల్లా -17ఏప్రిల్ (మహాప్రభ )**
పంచాయతీరాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలని.ప్రతి సర్పంచ్ గ్రామానికి లీడర్ గా వ్యవహరిం. చాలని. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో సర్పంచులు ,పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు 15 ఆర్థిక సంఘం నిధుల వినియోగం పై వర్క్ షాప్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో 15 వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా వినియోగించి గ్రామా అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు మోడల్ గా తీర్చిదిద్దాలని, గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు, అంగన్వాడీ బిల్డింగ్స్, జిపి బిల్డింగ్స్ లేని గ్రామాలకు నూతన బిల్డింగ్స్ ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రత్యేక అధికారి, పంచాయతీ సెక్రెటరీ సర్పంచ్ సమన్వయంతో గ్రామ పంచాయతీలో పనులు సవ్యంగా నడవాలన్నారు. గ్రామాల్లో సమస్యలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని 15 ఆర్థిక సంఘం నిధులను అన్ని గ్రామాలకు ప్రభుత్వం అందించిందని ,వాటితో గ్రామాల్లో సమస్యలు లేకుండా ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. నిధుల వినియోగం లో అక్రమాలకు తావులేదన్నారు. నిధులు సక్రమంగా వినియోగించక పోతే ,అక్రమాలు జరిగితే సర్పంచ్ , కార్యదర్శుల పై చర్యలకు వెనకాడబోమని హెచ్చరించారు. గ్రామాల్లో త్రాగు నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఈ.ఈ మిషన్ భగీరథ ఇంట్రా సంపత్ కుమార్, గ్రిడ్ డి.ఈ నాగభూషణం, డివిల్పిఓలుసాయి బాబు, తిరుపతి రెడ్డి ,అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాలుగో వార్డ్ లో స్పెషల్ డ్రైవ్

**-పరిసరాల పరిశుభ్రతే ప్రజల ఆరోగ్యం**
**- కౌన్సిలర్ జైపాల్ నాయక్**



**తూప్రాన్ ఏప్రిల్ 17,(మహాప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ లోని నాలుగో వార్డ్ లో ప్రజా పాలన భాగంగా స్పెషల్ డ్రైవ్ శుక్రవారం జరిగింది మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ జైపాల్ నాయక్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రజల ఆరోగ్యం అని అందుకని ప్రజలందరూ చుట్టుపక్కల అంత శుభ్రత ఉంచి బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయొద్దని మునిసిపల్ సిబ్బందికి సహకరించాలని ప్రజలు కూడా భాగస్వాములు కావాలని అప్పుడే పరిశుభ్రతకు సాధ్యమవుతుందని ప్రజలకు సూచించారు మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి మాట్లాడుతూ తూప్రాన్ మున్సిపాలిటీ పరిశుభ్రతలో అందరికీ ఆదర్శవంతంగా ఉండాలని ప్రజల సహకారం కూడా అవసరమని చుట్టుపక్కల పిచ్చి మొక్కలు ఉండకూడదని దోమలు వ్యాపించి ప్రజలు అనారోగ్యం పాలవుతారని కాబట్టి మనిషి భద్రత ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ప్రజలకు సూచించారు మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్ మాట్లాడుతూ పరిశుభ్రత ఉంటే ప్రజలందరూ ఆరోగ్యంగానే ఉంటారని ఎండాకాలం దృశ్య సిబ్బంది కూడా ఎండను చూసి పని చేసుకోవాలని అలాగే ప్రతి వార్డులో సైనిటైజర్ తప్పనిసరి ఉండాలని ప్రజల ఆరోగ్యం ఎంత ముఖ్యమో పరిశుభ్రత కూడా అంతే ముఖ్యమని తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ షర్మిల రాములు మున్సిపల్ శానిటైజర్ ఆఫీసర్ మధు ఎలక్ట్రిషన్ ఆఫీసర్ సంతోష్ రెడ్డి జవాన్ ఇర్ఫాన్ వినోద్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల నిరసన ర్యాలీ




**దేవరకొండ ఏప్రిల్ 17 ( మహాప్రభ)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల, రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన 1.5 విడతల కరువు బత్యం, 2.2023 నుండి అమలు కావలసిన పేరివిజన్ కమిషన్, 3.నగదు రహిత హెల్త్ కార్డులు,4.2024 నుండి నేటి వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు వారికి రావలసిన గ్రాడ్యూటీ, కమ్యూటేషన్, జి. పి. ఫ్ అందక నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పై అన్ని రకాల ఆర్థిక వనరులను మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంను కోరుతూ లంచ్ అవర్లో నిరసన ర్యాలీ నిర్వహించి ఆర్డిఓ గారికి, తహసీల్దార్ దేవరకొండ గారలకు వినతిపత్రం అందజేయడం జరిగినది. ఈ నిరసన కార్యక్రమంలో అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ, సహా అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఇజాక్,ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగనూరు లింగయ్య, ఉపాధ్యక్షురాలు పడమటి శాంతకుమారి సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, కార్యవర్గం సభ్యులు మునిని వీరయ్య, పెసర వెంకన్న, నందులాలు, మహమ్మద్ మౌలానా మోటమర్రి పురుషోత్తం, బొలుసాని సత్యనారాయణ, కోర్వి లక్ష్మయ్య, కోటయ్య,ముత్యాలులక్ష్మి, లక్ష్మి, అజుబా, స్వర్ణలత, చారి, సత్యం తదితరులు పాలుగొన్నారు.

# బిజినెస్

## ఒక్కసారిగా కుప్పకూలిన
# బంగారం, వెండి ధరలు..

**ఉన్నట్లుండి భారీగా పతనం.. ఇప్పుడు తులం ఎంతంటే..?**



బంగారం ధరల పెరుగుదలకు బ్రేక్ పడింది. ఉన్నట్లుండి ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. ధరలు ఒక్కసారిగా భారీగా పతనమయ్యాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి ఇదే మంచి అవకాశంగా చెప్పవచ్చు. సోమవారం నుంచి ధరలు పెరుగుతూనే వస్తుండగా.. ఇప్పుడు ఒకసారిగా బ్రేక్ పడినట్లయింది. శుక్రవారం గంటల్లోనే ధరలు తారుమారు అయ్యాయి. లేటెస్ట్ రేట్లు ఇలా..హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,54,200 వద్ద కొనసాగుతోంది. ఉదయం రూ.1,55,570 వద్ ఉండగా.. ఒక్కసారిగా రూ.1370 కుప్పకూలింది. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,41,350 వద్ద ఇప్పుడు కొనసాగుతోండగా... ఉదయం రూ.1,42,600 వద్ద ఉంది. దీనిపై రూ.1250 తగ్గిందని చెప్పవచ్చు.జోతిష్య శాస్త్రం ప్రకారం, ఒక్కో లోహానిని ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. బంగారం బృహస్పతి గ్రహానికి సూచికగా చెబుతారు. ఇది సంపదను రెట్టింపు చేస్తుంది. అయితే, కొందరికి మాత్రమే బంగారం శుభాన్ని ఇస్తుంది. ఇక రాశుల్లో వీరు బంగారం ధరిస్తే వారి జతకమే మారుతుంది.అటు బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,200 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,41,350 వద్ద ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,54,350 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,41,500 వద్ద ఉంది.ఇక వెండి ధరలు కూడా కుప్పకూలాయి. ప్రస్తుతం ఢిల్లీలో కేజీ సిల్వర్ రూ.2.65 లక్షల వద్ద ట్రేడవుతోంది. ఇది ఉదయం రూ.2.70 లక్షలుగా ఉంది. ఒకేసారి రూ.5 వేలు తగ్గింది. ఇక హైదరాబాద్‌లో కేజీ సిల్వర్ రూ.2.75 లక్షల వద్ద ఉంది. ఇక చెన్నైలో కూడా ఇదే ధర కొనసాగుతోంది

# స్మార్ట్‌ఫోన్ ధరలకు రెక్కలు..
## కనీస పెంపు 15 శాతం.. బడ్జెట్ ఫోన్లకే సమస్య

దేశంలో స్మార్ట్ ఫోన్ వినియోగదారులకు షాకిస్తున్నాయి. వరుసగా స్మార్ట్‌ఫోన్ల ధరలు పెరుగుతుండటం వినియోగదారుల్ని కలవరపెడుతోంది. చిప్స్ సహా ఫోన్ కంపోనెంట్స్ ధరలు పెరగడం, కంపెనీలకు లాభాల మార్జిన్లు తగ్గడం, అంతర్జాతీయ పరిణామాల వల్ల పలు ఉత్పత్తుల రవాణా నిలిచిపోవడం వంటివి ఫోన్ల ధరలు పెరగడానికి కారణాలుగా తెలుస్తోంది. ప్రస్తుతం చాలా ఫోన్లు సామాన్యులకు అందుబాటులో లేకుండా ధరలు పెరిగాయి.ఒక కేటగిరి నుంచి ఇంకో కేటగిరిలోకి ధరలు చేరిపోయాయి. గతంలో చాలా కాలం క్రితం విడుదలైన మోడల్స్, ఇంతకుముందు తక్కువ ధరకు లభించిన ఫోన్లు కూడా ఇప్పుడు అధిక ధరలకు దొరుకుతున్నాయి. గత మార్చి నుంచి స్మార్ట్‌ఫోన్ల ధరలు పెరుగుతున్నట్లు మార్కెట్ నివేదికలు చెబుతున్నాయి. అన్ని రకాల ఫోన్ల ధరలు పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్లో 200 రకాల స్మార్ట్‌ఫోన్లు ఉండగా, వాటిలో 80 మోడళ్ల ధరలు ఇప్పటికే పెరిగాయి. సగటున 15 శాతం ధరలు పెరిగాయి. త్వరలో మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఎక్కువ ధరల ప్రభావానికి గురవుతున్నవి మాత్రం మీడియం, ఎంట్రీ లెవల్ ఫోన్లే. రూ.15,000లోపు ధర కలిగిన ఫోన్లు ఎక్కువగా రేట్లు పెరుగుతున్నాయి. దీంతో ఈ ఫోన్ల



అమ్మకాలు ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 33 శాతం పడిపోయాయి. ఈ తరహా ఫోన్లలో చాలా తక్కువ మార్జిన్లు వస్తుంటాయి.తయారీ, ఇతర ఖర్చులు పెరగడంతో కంపెనీలు ఈ భారాన్ని వినియోగదారులపై మోపుతున్నాయి. దీంతో ఎంట్రీ లెవల్ ఫోన్లు కూడా అందుబాటులో లేకుండా పోయాయి. రూ.15 వేల నుంచి రూ.30 వేల ధరలోపు ఫోన్లు మాత్రం ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. మార్కెట్లో వీటి వాటా 35 నుంచి 45 శాతం పెరిగాయి. అయితే, ఇందులో చాలా ఫోన్లు గతంలో బడ్జెట్ రేంజ్‌లోనే ఉండేవి. ఇప్పుడు మీడియం రేంజ్‌లో లభిస్తున్నాయి. దీంతో బడ్జెట్ రేంజ్‌లో ఇప్పుడు సరైన ఫోన్లు లభించడం లేదు. ఇప్పటికే ఫోన్ల ధరల పెరుగుదలతో వినియోగదారులు ఇబ్బంది పడుతుంటే, రాబోయే రోజుల్లో మరో 15 శాతం ధరలు పెరిగే ఛాన్స్ ఉందని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. కొత్తగా రాబోతున్న ఫోన్లు కూడా వాటి ఫీచర్లతో పోలిస్తే కనీసం 30 నుంచి 40 శాతం ధరలు పెంచి విక్రయించే ఛాన్స్ ఉంది.

# విప్రో 15 వేల కోట్లబైబ్యాక్


న్యూఢిల్లీ,
విప్రో నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.3,501.8 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.6 శాతం ఎగబాకి రూ.24,236.3 కోట్లకు చేరుకున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.92,624 కోట్ల ఆదాయంపై రూ.13,197.4 కోట్ల నికర లాభాన్ని గడించింది.మరోవైపు, ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా గురువారం కంపెనీ బోర్డు సమావేశమై రూ.15 వేల కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు ప్రక్రియకు ఆమోదం తెలిపింది. కంపెనీ చరిత్రలో ఇంతటి స్థాయిలో షేర్లను బైబ్యాక్ చేయడం ఇదే తొలిసారి.

wipro

# సన్ రైజర్స్ జట్టుకు గాయాల బెడద

**-సీమర్ డేవిడ్ పేన్ చీలమండ గాయం**
**-ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే చాన్స్!?**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టును గాయాల బెడద వెంటాడుతూనే ఉంది. త్తజాగా ఈ మాజీ ఛాంపియన్ కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇంగ్లాండ్ లెఫ్ట్ ఆర్మ్ సీమర్ డేవిడ్ పేన్ చీలమండ గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా అధికారికంగా ధృవీకరించింది. 35 ఏళ్ల పేన్ ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో రెండు వికెట్లు తీసి పర్వాలేదనిపించాడు. ముఖ్యంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతను త్వరగా కోలుకోవాలని టీమ్ సభ్యులు ఆకాంక్షించారు. నిజానికి ఈ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ ప్లేయర్లు గాయపడటం ఇది మొదటిసారి కాదు. అంతకుముందు ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ చేతి గాయంతో టోర్నీ ప్రారంభంలోనే నిష్క్రమించాడు. అతని స్థానంలో శ్రీలంక ఫాస్ట్ బౌలర్ దిల్షాన్ మధుశంకను జట్టులోకి తీసుకున్నారు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదు మ్యాచ్‌ల్లో రెండు



విజయాలు, మూడు ఓటములతో నాలుగో స్థానంలో ఉన్న హైదరాబాద్ జట్టుకు ఈ గాయాలు ఒక పెద్ద సవాలుగా మారాయి. ప్రస్తుతం జట్టు నెట్ రన్ రేట్ ం0.576 గా ఉంది.ఒకవైపు డేవిడ్ పేన్ దూరం అవ్వడం ఇబ్బంది కలిగించినా, మరోవైపు ఎస్ఆర్‌హెచ్ ఫ్యాన్స్‌కు ఒక అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. జట్టు రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఫిట్‌నెస్ టెస్ట్ క్లియర్ చేశాడు. త్వరలోనే అతను స్క్వాడ్‌తో చేరబోతున్నాడు. ఏప్రిల్ 25న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో కమిన్స్ బరిలోకి దిగే అవకాశం ఉంది. కమిన్స్ అందుబాటులో లేని సమయంలో ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. కిషన్ సారథ్యంలో టీమ్ రెండు మ్యాచ్‌ల్లో గెలిచి తన ఉనికిని చాటుకుంది. గత సోమవారం టేబుల్ టాపర్స్ రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ అద్భుత విజయం సాధించింది. 217 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన ఎస్ఆర్‌హెచ్, ప్రత్యర్థిని 159 పరుగులకే కట్టడి చేసింది. అరంగేట్రం చేసిన యువ బౌలర్లు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ చెరో నాలుగు వికెట్లు తీసి రాజస్థాన్ పతనాన్ని శాసించారు. 57 పరుగుల తేడాతో గెలిచిన ఆరెంజ్ ఆర్మీ ఇప్పుడు ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉంది. శనివారం తమ హోమ్ గ్రౌండ్ అయిన ఉప్పల్ స్టేడియంలో ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తో తలపడనుంది. హోమ్ క్రౌడ్ ముందు రుతురాజ్ సేనను ఓడించి విజయ పరంపరను కొనసాగించాలని హైదరాబాద్ ప్లాన్ చేస్తోంది. సొంతగడ్డపై రాయల్స్ పై గెలుపొందడం, చెన్నైతో మ్యాచ్ కూడా సొంతగడ్డపైనే జరుగనుండటంతో ఈ విజయంపై కన్నేసింది. ఇక డబుల్ హెడర్ లో భాగంగా శనివారం రాత్రి ఈ మ్యాచ్ జరుగుతుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ పై ఫుల్ క్రేజ్ ఉండగా, టికెట్లకు భారీ డిమాండ్ ఉంది.

# స్పోర్ట్స్

## ఢిల్లీతో మ్యాచ్‌కు గ్రీన్ జెర్సీల్లో..



**బెంగళూరు**
ఐపీఎల్‌లో తమ రెగ్యులర్ జెర్సీ (ఎరుపు)కి బదులు ఒక మ్యాచ్‌కు ఆకుపచ్చ జెర్సీల్లో ఆడే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఆటగాళ్లు ఈ సీజన్‌లో శనివారం చిన్నస్వామి వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగబోయే మ్యాచ్‌కు గ్రీన్ జెర్సీల్లో ఆడనున్నారు.గ్రీన్ ఇన్షియేటివ్' కార్యక్రమంలో భాగంగా 2011 నుంచి ఆర్‌సీబీ ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నది.

## భారత్ 157/7





**డర్బన్:**
దక్షిణాఫ్రికాతో తొలి టీ20 పోరులో భారత మహిళల జట్టు ఆకట్టుకుంది. టీ20 ప్రపంచకప్ సన్నాహాలోల భాగంగా శుక్రవారం జరిగిన పోరులో తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 157/7 స్కోరు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ (47 నాటౌట్), రోడ్రిగ్స్ (36) రాణించారు. ఓపెనర్లు షెఫాలీవర్మ (34), మందన (13) మెరుగైన శుభారంభం అందించారు. ఖాక (3/16), తుమి సెకునె(2/27) ఆకట్టుకున్నారు.

# నా రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొడతాడు

**గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్**

టీమిండియా స్టార్ క్రికెటర్, గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో అత్యంత కీలక విషయం క్లారిటీ అని వాషింగ్టన్ సుందర్ పేర్కొన్నారు. స్టేడియంలోకి వెళ్లే ముందే ప్రతి ఆటగాడికి తన బాధ్యత ఏంటో.. కెప్టెన్ తన నుంచి ఏం ఆశిస్తున్నాడో గిల్ చాలా స్పష్టంగా వివరిస్తాడని సుందర్ చెప్పుకొచ్చాడు. ఈ విధానం వల్ల ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గి, ప్రశాంతంగా తమ సహజసిద్ధమైన ఆటను ఆడగలుగుతున్నారని పేర్కొన్నాడు.భారత క్రికెట్‌లో ప్రస్తుతం సెన్సేషన్‌గా మారిన బీహార్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ గురించి వాషింగ్టన్ సుందర్ గొప్పగా మాట్లాడాడు. టీ20 క్రికెట్‌లో భారత్ తరపున అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా తన పేరిట ఉన్న రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొట్టే అవకాశం




ఉందని ఆయన అభిప్రాయపడ్డాడు. వైభవ్ వయసు తక్కువైనా అతని ఆలోచనా విధానం, నైపుణ్యం చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుందని, అతడు భవిష్యత్తులో టీమిండియాకు సుదీర్ఘ కాలం ఆడుతాడని వాషింగ్టన్ సుందర్ ఆశాభావం వ్యక్తం చేశాడు.టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌కు, గుజరాత్ టైటాన్స్ డ్రెస్సింగ్ రూమ్‌కు పెద్దగా తేడా ఏమీ లేదని సుందర్ తెలిపాడు. ఇక్కడ ఆటగాళ్లందరి మధ్య మంచి సమన్వయం ఉందని, జట్టులోని భారతీయ ఆటగాళ్లంతా టీమిండియాలో కూడా కలిసి ఆడిన వారు కావడంతో ఒకరి గురించి ఒకరికి బాగా తెలుసని చెప్పాడు. కేవలం మైదానంలోనే కాకుండా టీమ్ రూమ్‌లో కూడా అందరం కలిసి ఎక్కువ సమయం గడపడం వల్ల ఓ కుటుంబంలా కలిసిపోయామని, ఈ వాతావరణమే గుజరాత్ టైటాన్స్ జట్టును ప్రత్యేకంగా నిలుపుతుందని పేర్కొన్నాడు.కోచ్ ఆశిష్ నెహ్రా గురించి మాట్లాడుతూ.. ఆయనతో కలిసి పనిచేయడం ఎప్పుడూ గొప్ప అనుభూతినిస్తుందని వాషింగ్టన్ సుందర్ తెలిపాడు. గత నాలుగేళ్లుగా గుజరాత్ జట్టుతో నెహ్రాకు ఉన్న అనుబంధం అద్భుతమని, ఆయన ఆటగాళ్ల బలాలు, బలహీనతలను చాలా సులభంగా అర్థం చేసుకుంటారని కొనియాడాడు. ఐపీఎల్ తన జీవితాన్ని మార్చివేసిందని, 2017లో మొదలైన తన ప్రయాణం ఇప్పుడు ఒక దశాబ్దానికి చేరువవుతోందని, సీనియర్ ఆటగాడిగా తన బాధ్యతలను నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నానని వాషింగ్టన్ సుందర్ స్పష్టం చేశాడు.




# యదార్థ సంఘటనల ఆధారంగా 'చేతబడి'!

## హీరోగా, విలన్‌గా జేడీ చక్రవర్తి విశ్వరూపం..

టాలీవుడ్ నటుడు జేడీ చక్రవర్తి కథానాయకుడిగా బాణామతి అనే విభిన్నమైన నేపథ్యంతో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'చేతబడి'. ఈ సినిమా ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. యదార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు వీ3 మీడియా మరియు మహా మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మహర్షి కూండ్ల సమర్పణలో మహేంద్ర నాథ్ కూండ్ల ఈ భారీ ప్రాజెక్టును నిర్మిస్తుండగా, సూర్యాస్ ఈ చిత్రానికి కథను అందిస్తూ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. గురువారం జేడీ చక్రవర్తి పుట్టినరోజును పురస్కరించుకుని మేకర్స్ ఈ సినిమా టైటిల్ మరియు ఆయన పాత్రకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఈ చిత్రంలో జేడీ చక్రవర్తి గతంలో ఎన్నడూ చూడని విధంగా ఒకేసారి హీరోగా మరియు విలన్‌గా రెండు విభిన్న పార్శ్వాలు కలిగిన పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారు.మరోవైపు ఈ సినిమా ఇంకా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కాకముందే ట్రేడ్ వర్గాల్లో భారీ క్రేజ్ సంపాదించుకుంది. ముఖ్యంగా మ్యూజిక్ సెన్సేషన్ 'సరిగమ' సంస్థ ఈ చిత్రం యొక్క ఆడియో హక్కులను ఐదు భాషల్లో భారీ ధరకు దక్కించుకోవడం విశేషం. సాధారణంగా ఒకే పాటను అన్ని భాషల్లోకి అనువదించడం చూస్తుంటాం, కానీ ఈ చిత్రంలో విజువల్స్ ఒకేలా ఉన్నప్పటికీ, తెలుగులో ఒక పాట ఉంటే మిగిలిన భాషల్లో విభిన్నమైన పాటలు ఉండేలా ప్లాన్ చేయడం సినిమాపై మరింత కుతూహలాన్ని పెంచుతోంది. ఈ వినూత్న ప్రయోగానికి అచ్చు రాజమణి సంగీతం అందిస్తుండగా, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ సాహిత్యం సమకూర్చడం ఈ ప్రాజెక్టుకు ప్రధాన బలంగా నిలుస్తోంది. సాంకేతికంగా కూడా అత్యున్నత ప్రమాణాలతో రూపొందుతున్న ఈ చిత్రానికి మిర్లాన్ నజీర్ సినిమాటోగ్రఫీని, వంశీ ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆశిష్ తేజ పూలల ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. హారర్ మరియు మిస్టరీ అంశాల మేళవింపుతో, ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా ఈ సినిమా కథా గమనం ఉండబోతోంది. ఇప్పటికే విడుదలైన ప్రీ-లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా, వచ్చే నెల నుండి ఈ చిత్రం యొక్క రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. గణేష్ -- కుమార్ ఈ చిత్రానికి పీఆర్‌ఓలుగా వ్యవహరిస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ చిత్రం జేడీ చక్రవర్తి కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.




## సంక్రాంతికి వస్తున్నాం..

# నాకెంతో ప్రత్యేకం





విక్టరీ వెంకటేష్ హీరోగా దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులను సృష్టించడమే కాకుండా తాజాగా ప్రతిష్టాత్మక అవార్డును కూడా సొంతం చేసుకుంది. ముంబైలో జరిగిన ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డుల వేడుకలో అనిల్ రావిపూడి తెలుగు విభాగంలో 'ఉత్తమ దర్శకుడు' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కెరీర్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా అత్యంత ప్రత్యేకమైనదని తెలిపాడు. కేవలం రూ.50 కోట్ల రూపాయల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, పెట్టిన పెట్టుబడికి ఆరు రెట్ల లాభాలను తెచ్చిపెట్టడం ఒక దర్శకుడిగా తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ సినిమాకు కమర్షియల్ సక్సెస్‌తో పాటు విమర్శకుల ప్రశంసలు మరియు జాతీయ స్థాయి అవార్డు దక్కడం పట్ల అనిల్ రావిపూడి హర్షం వ్యక్తం చేశారు.



# సింగిల్‌గానే ఫుల్ హ్యాపీ అంటున్న హన్సిక..


దేశముదురు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది అందాల భామ హన్సిక. తొలి సినిమాతోనే తన క్యూట్ నెస్ తో కుర్రాళ్ల గుండెల్లో ప్రింట్ అయ్యింది ఈ చిన్నది. దేశముదురు సినిమా తర్వాత ఈ అమ్మడు తెలుగులో వరుసగా సినిమాలు చేసింది. తెలుగులో తక్కువ సమయంలోనే విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది హన్సిక. తెలుగు స్టార్ హీరోల సరసన నటించింది. ఎన్టీఆర్ తో కంత్రి, ప్రభాస్ తో బిల్లా, రామ్ తో కందిరీగ, మస్కా సినిమాలో నటించింది. కెరీర్ పీక్ లో ఉండగానే బాలీవుడ్ లోనూ అదృష్టన్ని పరీక్షించుకుంది. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో సినిమాలు చేసి ఆకట్టుకుంది ఈ అమ్మడు.. 2022 డిసెంబర్ 4న జైపూర్ ప్యాలెస్ లో వ్యాపారవేత్త సోహెల్ ఖతూరియా ప్రేమించి పెళ్లాడింది. పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. అయితే పెళ్లైన 4 ఏళ్లకే విడాకులు తీసుకుంది. తమకు విడాకులు మంజూరు చేయాలని హన్సిక బాంద్రా ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. తాజాగా న్యాయస్థానం వీరికి విడాకులు మంజూరు చేసింది. కాగా తాజాగా హన్సిక చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించింది హన్సిక. ఇప్పుడు తాను చాలా సంతోషంగా ఉన్నానని పేర్కొన్నారు. అంతే కాదు చాలా స్వేచ్ఛగా ఉన్నానని, ఒంటరితనం తనకు ఎప్పుడూ ఇష్టమని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ ఒంటరిజీవితంలో చాలా సంతోషం కలిగింది అని అన్నారు. తన వాళ్ల కోసం సమయాన్ని గడపడం, తనకు నచ్చింది చేయడం చాలా సంతోషంగా ఉంది అని నటి హన్సిక చెప్పుకొచ్చింది.

# పాటల సందడిలో లెనిన్




అక్కినేని అఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. రాయలసీమ గ్రామీణ నేపథ్యంలో బలమైన సామాజికాంశాలను చర్చిస్తూ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. మురళీకృష్ణ అబ్బూరు దర్శకుడు. జూన్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో గురువారం మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుడుతూ 'ఎట్టా ఎట్టా..' అనే తొలి గీతాన్ని విడుదల చేశారు. తమన్ స్వరపరచిన ఈ పాటను భాస్కరభట్ల రచించారు. సింగర్ శ్రీకృష్ణతో కలిసి తమన్ ఈ గీతాన్ని ఆలపించారు.మాస్ మెలోడీగా సాగిన ఈ పాటలో నాయకానాయికలు అఖిల్, భాగ్యశ్రీ బోర్సే మధ్య కెమిస్ట్రీ హైలైట్‌గా నిలిచింది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: లియోన్ బ్రిట్టో, సంగీతం: తమన్, దర్శకత్వం: మురళీ కిశోర్ అబ్బూరు.

# అల్లు అర్జున్ రాకాలో షారూఖ్ ఖాన్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ కమర్షియల్ డైరెక్టర్ అట్లీ కలయికలో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రాకా' పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ అంచనాలను మరింత పెంచుతూ తాజాగా ఒక బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అట్లీ ఇప్పటికే షారుఖ్‌తో 'జవాన్' వంటి భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. అదే చొరవతో 'రాకా'లో ఒక కీలకమైన అతిథి పాత్ర కోసం షారుఖ్‌ను అడిగారని, అందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. అల్లు అర్జున్ స్టైలిష్ యాక్షన్, అట్లీ టేకింగ్, దానికి తోడు షారుఖ్ ఖాన్ చరిష్మా తోడైతే ఈ చిత్రం గ్లోబల్ లెవల్‌లో రికార్డులు సృష్టించడం ఖాయమని మేకర్స్ భావిస్తున్నారు. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com